www.bharathasakthi.com

# భారత్ శక్తి ®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 21 | హైదరాబాద్ | గురువారం,జూన్ 25 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## తెలంగాణలో జనసేన జోరు



**అమరావతి (భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన ఫోకస్ పెంచింది. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేసేందుకు జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాచరణ మొదలుపెట్టారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఇతర పార్టీల నుండి వచ్చే వలసలను సమన్వయం చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన 'తెలంగాణ జాయినింగ్స్ కమిటీ'ని అధికారికంగా నియమించారు. పార్టీ భావజాలానికి ఆకర్షితులవుతున్న విద్యావంతులు, సామాజికవేత్తలు, రిటైర్డ్ ఐఏఎస్/ఐపీఎస్ అధికారులు, తటస్థులను లైన్‌లోకి తెచ్చే బాధ్యతను ఈ ఏడుగురు సభ్యులకు అప్పగించారు.

## SIR జాబితా నుంచి పేరు తొలగిస్తే రేషన్ ఇవ్వరా?..



**న్యూఢిల్లీ, (భారత శక్తి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

2లో..

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం..



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది.ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. తెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.దఫిబ్రవరిలో జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. దాదాపు

2లో..

## ఆ నలుగురివి మాయమాటలు

### ప్రజలు నమ్మొద్దు: భట్టి విక్రమార్క



**ఖమ్మం,(భారత శక్తి):** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను

2లో..

## 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

### నేతలకు స్ట్రాంగ్ వార్నింగ్!



- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

**హైదరాబాద్, జూన్ 24 (భారత శక్తి ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలక అంశంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే నేతలపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నియోజకవర్గ ఇన్‌చార్జిలను మార్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన

2లో..



## రూ. 1,000 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

- ఐటీ కారిడార్‌లో హైడ్రా మెరుపు దాడి.. - 5 ఎకరాల ఆక్రమణలు ధ్వంసం

**హైదరాబాద్, జూన్ 24 (భారత శక్తి ప్రతినిధి):** ఐటీ కారిడార్ నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) స్వాధీనం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 42లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం ఆక్రమణల నుంచి విముక్తం చేసింది. ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ దాదాపు రూ. 1,000 కోట్లు ఉంటుందని అంచనా.

### షెడ్ల కూల్చివేత.. ఫెన్సింగ్ ఏర్పాటు

మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న ఈ భూమిని కాజేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నించారు. అందులో రెండు తాత్కాలిక షెడ్లు, ఒక గదిని నిర్మించడమే కాకుండా, చుట్టూ రేకుల షీట్లతో ప్రహరీ

2లో..

## బీఆర్ఎస్ హయాంలో చెరువులన్నీ కబ్జా- మధుయాష్కి గౌడ్



- ఎల్బీనగర్‌లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అనుచరుల భూదందా.
- ఆక్రమణలను వదిలిపెట్టేది లేదు..
- 'హైడ్రా'కు ఫిర్యాదు చేస్తాం.
- బైరామల్‌గూడ చెరువు సుందరీకరణకు రూ. 10 కోట్లు
- అధికారులతో కలిసి చెరువును పరిశీలించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్,

**హైదరాబాద్ జూన్24 (భారత శక్తి ):**గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో చెరువులన్నీ దారుణంగా కబ్జాలకు గురయ్యాయని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తీవ్రంగా విమర్శించారు.

2లో..

## వీడిన కృష్ణలంక కేసు మిస్టరీ..

### జై భీమ్' సీన్ రిపీట్!!

#### సాయికృష్ణది లాకప్ డెత్తే..
#### కోర్టుకు సమర్పించిన నివేదికలో నిర్ధారించిన 'సిట్'!

- తీవ్ర థర్డ్ డిగ్రీ హింసకు తాళలేక యువకుడు సాయికృష్ణ లాకప్ డెత్
- మృతదేహాన్ని స్వర్గపురి శ్మశానవాటికలో రహస్యంగా దహనం చేసిన పోలీసులు
- కేసును తప్పుదోవ పట్టించడానికి పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్ మొత్తాన్ని ఉద్దేశపూర్వకంగా డిలీట్ చేసిన వైనం
- సీఐ నాగరాజును దర్యాప్తుకు సహకరించడం లేదన్న సిట్
- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్.. నెల్లూరు జైలుకు తరలింపు

12లో..



## మతిపోయిన ఖాకీలు..



### క్యాన్సర్ యువకుడిపై ముగ్గురి పోలీసుల లైంగిక దాడి

- కీమోథెరపీతో వెంట్రుకలు ఊడిపోతే.. అమ్మాయిల ఉన్నావంటూ వేధింపులు
- క్యాన్సర్ మగ పేషెంట్‌పై ముగ్గురు పోలీసుల లైంగిక దాడి
- ఇద్దరు ఏఎస్సైలు, ఒక కానిస్టేబుల్ సస్పెండ్

**క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడిపై ముగ్గురు పోలీసులు దారుణానికి ఒడిగట్టారు. కీమోథెరపీ చికిత్సతో కాళ్లు, చేతులకు వెంట్రుకలు ఊడిపోవడంతో అమ్మాయిలు ఉన్నావంటూ వేధించడమే కాకుండా, అతనిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాలో జరిగిన ఈ ఘటలన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ముగ్గురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.**

12లో..

## "మాదకద్రవ్యాలకు నో... లక్ష్యాలకు యెస్" చెప్పండి



- రేపటి భవిష్యత్తుకు మార్గదర్శకాలు మిరే.
- విద్యార్థులతో కలిసి గంజాయి వ్యతిరేక ప్రతిజ్ఞ
- చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్,

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 24( భారత శక్తి ):**నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. "సే నో టూ డ్రక్స్ --" సే ఎస్ టూ లైఫ్ " అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఆచరణలో పెట్టాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన "మన ఊరు -- మన బాధ్యత" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, పాల్గొని విద్యార్థులకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

12లో..

# రూ. 1,000 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం



ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూమి తమదేనంటూ ఎవరినీ అటువైపు రాకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణలను పూర్తిగా తొలగించి, ఐదు ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసింది.

### హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఆక్రమణల తొలగింపు అనంతరం సదరు స్థలం ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూ హైడ్రా అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణే ధ్యేయంగా హైడ్రా చేపట్టిన ఈ మెరుపు దాడి ఐటీ కారిడార్‌లో తీవ్ర కలకలం రేపింది.

# ట్రై కార్పొరేషన్ల పరిధిలో వైభవంగా ఆషాఢ బోనాలు

- లండన్ నుండి 'జూమ్' దృశ్య మాధ్యమ సమీక్షలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి సురేఖ.
- ఉత్సవాలకు రూ. 20 కోట్లు కేటాయింపు: సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు.
- మహిళల భక్తి, తెలంగాణ ఆత్మకు ప్రతీక మన బోనాల పండుగ
- ఉత్సవాల కాలపరిమితి: జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు
- తొలి బోనం: జూలై 16న గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయంలో ప్రారంభం
- 'మహాలక్ష్మి' ఉచిత బస్సుల నేపథ్యంలో రవాణా శాఖకు ప్రత్యేక ఆదేశాలు





**హైదరాబాద్, జూన్ 24 (భారత శక్తి ):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద వారసత్వానికి అత్యున్నత ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి తెలిపారు. గతంలో కేవలం ఒకే కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఈ ఉత్సవాలను, ఈసారి మరింత విస్తృతంగా, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న మంత్రి, బుధవారం అక్కడి నుంచే దృశ్య మాధ్యమ సమావేశం (జూమ్ యాప్) ద్వారా హైదరాబాద్‌లోని 'మరి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ' (మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీ) లో జరిగిన బోనాల ఉత్సవాల ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అజారుద్దీన్, శాసనమండలి సభ్యులు బొగ్గారపు దయానంద్, శాసనసభ్యులు నవీన్ యాదవ్, దానం నాగేందర్, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ప్రభుత్వ ధార్మిక సలహాదారు గోవింద హరి మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### జూలై 16న గోల్కొండలో తొలి బోనం

ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో జరగనున్నాయని మంత్రి ప్రకటించారు. జూలై 16న చారిత్రాత్మక గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో ప్రారంభమయ్యే ఉత్సవాలు, ఆగస్టు 13న సాగనంపు కార్యక్రమంతో అట్టహాసంగా ముగుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం (భవిష్యవాణి), గావుపట్టడం వంటి సాంప్రదాయ ఘట్టాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతాయని, ఈ సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

### రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రూ. 20 కోట్ల భారీ నిధులు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దేవాదాయ శాఖపై, ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని మంత్రి కొనియాడారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల ఘనమైన నిర్వహణ కోసం రూ. 20 కోట్ల నిధులను కేటాయించినందుకు ముఖ్యమంత్రికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులను ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, క్యూలైన్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, విద్యుత్ మరియు పుష్పాలంకరణలు, నిఘా కెమెరాల (సీసీ కెమెరాలు) ఏర్పాటు మరియు వైద్య శిబిరాల కోసం సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

### 'మహాలక్ష్మి' ప్రభావం.. రవాణా, భద్రతపై ప్రత్యేక నిఘా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ఈసారి రాష్ట్రం నలుమూలల నుండి మహిళా భక్తులు, ప్రజలు హైదరాబాద్ నగరానికి భారీగా తరలివచ్చే అవకాశం ఉందని మంత్రి అంచనా వేశారు. ఈ నేపథ్యంలో భక్తుల రవాణాకు ఇబ్బంది కలగకుండా అదనపు బస్సులు, ప్రత్యేక రవాణా ప్రణాళికలు సిద్ధం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. అదేవిధంగా, భారీ రద్దీ ఉండే ఆలయాల వద్ద నగర పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

### భక్తుల సౌకర్యార్థం వినూత్న చర్యలు

భక్తుల సౌకర్యార్థం దేవాదాయ, నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ), పోలీస్, విద్యుత్, రోడ్లు-భవనాల శాఖ, జలమండలి, ఆర్టీసీ, మెట్రో రైల్, వైద్య-ఆరోగ్య, అగ్నిమాపక, పర్యాటక, సమాచార పౌరసంబంధాల శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, గర్భిణులు మరియు బాలింతల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేకంగా 'స్తన్యపాన గదులను' (లాక్టేషన్ రూమ్స్) ఏర్పాటు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన బోనాల పండుగను ప్రపంచస్థాయిలో నిలిపేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# మహిళల కోసం ఎంత చేసినా ఒక్క అడుగు మిగిలే ఉంటుంది



**జూబ్లీహిల్స్** జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో వెటా ఇండియా ఉమెన్ ఎంపవర్మెంట్ ప్రోగ్రాంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు కవిత మాట్లాడుతూ ఈ ప్రపంచమే మహిళలకు వ్యతిరేకంగా ఉంది. ఎంత కష్టపడినా ప్రతిభ చూపినా సరే మహిళకు ఎక్కడో అడ్డుకట్ట పడుతోంది. సమాజంలో మార్పు కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. మహిళలు తమ లక్ష్యంపై నిర్ణయం తీసుకుంటే మీ మాట మీరే వినవద్దు. మహిళ సాధికారత కోసం వెటా ఇండియా సంస్థ, ఆ సంస్థ అధినేత ఝాన్సీ చేస్తున్న కృషి అభినందనీయం. మహిళల కోసం మనం ఎంత చేసినా సరే ఒక్క అడుగు మిగిలే ఉంటుంది. ఎంతో మంది మహిళలను పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా తయారు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇవ్వాళ ఇక్కడ జరుగుతున్న ఈ సదస్సుకు కూడా ఎన్నో రాష్ట్రాల నుంచి మహిళలు వచ్చారు. మహిళలంతా కూడా ఒక్కటే. మనమంతా ఒక్కటే కులం. ఇక్కడ ఉండేవి రెండే కులాలు.. ఒకటి మహిళల కులం, ఇంకొకటి మగవాళ్ల కులం. ఇవ్వాళ నేను ఒక మహిళ జడ్జి తో మాట్లాడుతూ మహిళ జడ్జిల సంఖ్య తక్కువ ఉందని అన్నాను. ఎగ్జామ్ రాసి వచ్చే మహిళ జడ్జిల సంఖ్య ఎక్కువగానే ఉంటున్నప్పటికీ ఆ తర్వాత పై స్థాయికి వెళ్లేందుకు మాత్రం వారికి అవకాశం రావటం లేదని చెబుతున్నారు. అంటే టాలెంట్, కష్టపడే గుణం ఉన్నప్పటికీ వాటి ఆధారంగా అవకాశాలు రావటం లేదు. అయినా సరే ఎంతో మంది మహిళలు ఇంటి పనులు చేసుకుంటూ కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. మగవాళ్లతో పోటీ పడి మరి కష్టపడుతున్నారు.. కానీ మనకు ఎక్కడో ఒక చోట అడ్డుకట్ట ఉంటుందని అన్నారు. మంచి జాబ్ చేస్తూ ప్రమోషన్ వచ్చే సమయంలో పెళ్లి చేస్తారు. పెళ్లి, పిల్లలు అంటూ కొన్ని సంవత్సరాలు గ్యాప్ ఇచ్చాక మళ్లీ పని చేయాలంటే జూనియర్లుగా చేయాల్సి వస్తుంది. అంటే ఈ ప్రపంచమే మనకు బయాస్డ్ గా ఉంది. ఆడ, మగ సమతౌల్యం అనేది లేదు. మహిళ సాధికారత జరగాలంటే ప్రభుత్వం, ఫ్యామిలీ, సొసైటీ అందరూ హెల్ప్ చేయాలి. అన్ని రంగాల్లో 50 శాతం మహిళ ఉద్యోగులు ఉండాలని ప్రభుత్వం ఒక ఆర్డర్ ఇచ్చిన సరే ఫ్యామిలీ సహకరించదు. తెలంగాణ వచ్చాక పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు సాధించుకున్నాం. కానీ ఆ 33 శాతం కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ కావటం లేదు. అంటే మహిళలకు ఇంట్లో, సొసైటీ నుంచి సపోర్ట్ ఉండటం లేదు. ఇప్పటికీ కూడా కొంచెం భిన్నంగా ఉంటే అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నేను ఒక రాజకీయ నాయకురాలిగా ఏదైనా మాట్లాడితే లక్ష మంది వరకు నన్ను ట్రోల్ చేసే ప్రయత్నం చేస్తారు. నేను మాట్లాడిన అంశంపై కాకుండా జెండర్ బేస్డ్ గా మాట్లాడుతుంటారు. అంటే ఈ ప్రపంచమే మనకు వ్యతిరేకంగా ఉంది. వెటా లాంటి ఆర్గనైజేషన్స్ ద్వారా కొంత మార్పు వస్తుంది. ఇప్పటికీ 2026 లో కూడా మన రాష్ట్రంలో 15-19 ఏళ్లలో పెళ్లై అమ్మలు అయిన వాళ్లు 7.2 శాతం ఉన్నారు. ప్రభుత్వాలు టీనేజ్ మ్యారేజ్ లను తగ్గించేందుకు ఎంత ప్రయత్నం చేసిన సరే పెద్దగా మార్పు రావటం లేదు. హైదరాబాద్ లో కూడా టీనేజ్ మదర్స్ 2.7 శాతం ఉన్నారు. అంటే ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపిస్తే మన బాధ్యత తీరిందని తల్లితండ్రులు భావిస్తున్నారు. సమాజంలో ఒక్క రోజులో మార్పు రాదు. అందుకు ఆడ, మగ అందరూ కృషి చేయాలి. ఇప్పుడున్న యువత సోషల్ మీడియాలో ఫాలోవర్స్, లైక్స్ కోసం ఆలోచిస్తోంది. అది అల్గరిథమ్ బేస్డ్ గా ఉంటుంది. అలా కాకుండా సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో ఉండాలి. ఇంటర్ నెట్, ఇప్పుడొచ్చిన ఏఐ కూడా బయాస్డ్ గా ఉంటుంది. అంటే గతంలో మహిళల మీద ఉండే వార్తలను, అభిప్రాయాలను బట్టే ఏఐ సమాచారం అందిస్తుంది. అందుకే మీరు ఎలా ఉన్నారన్నది మ్యాటర్ కాదు. మీ మనసులో ఉన్న లక్ష్యం కోసం ఎలా కష్టపడతారన్నదే మ్యాటర్. నిర్ణయం తీసుకోనే వద్దు.. తీసుకుంటే మాత్రం మీ మాట మీరే వినకుండా కష్టపడాలని అన్నారు.

# 'ఎస్ఐఆర్'పై సీఎం రేవంత్ ఫోకస్..

జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్‌పై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాల నుంచి నిజమైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే పది రోజుల పాటు నేతల పనితీరును పరిశీలిస్తామని, అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో అవగాహన పెంచడంలో సర్పంచ్‌లు కూడా చురుగ్గా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ అంశం చాలా సున్నితమైనదని, కొందరు నాయకులు దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా వారీగా నివేదికలు తనకు అందాయని, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో మరిన్ని అవగాహన సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. ముఖ్యంగా పేదల ఓటు హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓటు కోల్పోతే ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం గురువారం నుంచి ఇంటింటి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ తమ తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నాయి.

# ఆ నలుగురివి మాయమాటలు

అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం..

36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌కు సుప్రీం లీడర్‌గా సేవలందించారు. అంత్యక్రియలకు కోట్ల సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తరఫున కూడా ప్రతినిధి బృందం హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు తనను కూడా ఆహ్వానించారని షెహ్‌బాజ్ షరీఫ్ వెల్లడించారు.

# బంగారు కొండలతో రూ.150 కోట్ల పైనే ఆదాయం

**కర్నూలు,** రాయలసీమ పసిడి సీమగా మారనుంది. కరవు సీమలో బంగారు పంటలు పండనున్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలోని బంగారు గనులలో బంగారు ఉత్పత్తి ప్రారంభం కానుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బుధవారం రోజున జొన్నగిరి బంగారు ప్లాంట్ ప్రారంభం అయింది. ఈ ప్లాంట్ ద్వారా తొలి సంవత్సరం 400 కిలోలు, రెండో సంవత్సరం వేయి కేజీల బంగారం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తర్వాత ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 2 వేల కేజీలకు పెంచనున్నారు.కరవు సీమ రాయలసీమలో బంగారు పంటలు పండనున్నాయి. దేశంలోనే తొలి ప్రైవేట్ బంగారు గనిగా పేరొందిన.. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ బంగారం ఉత్పత్తికి సిద్ధమైంది. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బుధవారం జొన్నగిరి బంగారు గనులు ప్రారంభం అయ్యాయి. కర్నూలు జిల్లా జొన్నగిరితో పాటుగా మరికొన్నిచోట్ల బంగారు నిక్షేపాలను గుర్తించిన నేపథ్యంలో రాబోయే రోజులలో దేశంలోనే అతిపెద్ద బంగారం సరఫరాదారుగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని అధికారుల అంచనా. ఇక జొన్నగిరిలో సుమారుగా 50 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నట్లు ఏపీ గనుల శాఖ అంచనా వేస్తోంది. జొన్నగిరితో పాటుగా రామగిరి, జవ్వాకుల, చిగురుకుంట బిస్నాతం ప్రాంతాలలో బంగారు నిక్షేపాలను గుర్తించినట్లు ఏపీ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా చెప్తున్నారు. **1500 ఎకరాల్లో జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్** ..జొన్నగిరిలో 1500 ఎకరాలను బంగారు గనుల తవ్వకం కోసం పదేళ్ల కిందటే ఏపీ ప్రభుత్వం కేటాయించింది. అయితే కేటాయించిన భూమిలో ఇప్పటివరకు కేవలం 500 ఎకరాల పరిధిలో మాత్రమే బంగారం అన్వేషణ కోసం చర్యలు చేపట్టారు. ఈ 500 ఎకరాలలో 13 టన్నుల వరకు బంగారం ఉండే అవకాశం ఉందని అధికారుల అంచనా. మిగతా వేయి ఎకరాల్లో బంగారాన్ని అన్వేషించే పనులను తర్వాతి దశలో చేపట్టనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయితే.. 1500 ఎకరాలలో నిక్షిప్తమైన 50 టన్నుల బంగారాన్ని వెలికి తీయనున్నారు.బంగారు గనుల తవ్వకానికి భారీ పెట్టుబడి, ప్రత్యేక నైపుణ్యం అవసరం ఉంటుంది. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ద్వారా ప్రైవేట్ సంస్థలకు ఈ బాధ్యతలను అప్పగించింది. అలాగే గత కొన్నేళ్లుగా బంగారం వెలికితీతతో గణనీయమైన తగ్గుదల ఉన్నట్లు ముకేష్ కుమార్ మీనా చెప్తున్నారు. గతంలో ఒక టన్ను మట్టి నుంచి సుమారు మూడు గ్రాముల బంగారం లభించేదని.. ప్రస్తుతం ఆ రేటు టన్నుకు ఒక గ్రాముకు పడిపోయిందంటున్నారు. ఒక టన్ను మట్టి నుంచి లభించే బంగారం పరిమాణం 0.8 గ్రాముల కంటే తక్కువకు పడిపోతే, మైనింగ్ కార్యకలాపాలు లాభదాయకం కాకుండా పోతాయని ముఖేష్ కుమార మీనా వివరించారు.ఇక జొన్నగిరి ప్రాజెక్టును జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించనుంది. ఇందుకోసం 405 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టింది. జొన్నగిరి మైన్ ద్వారా సుమారుగా 700 మందికి ఉపాధి దొరుకుతుందని అంచనా. వీరిలో 80 శాతం మంది మన రాష్ట్రానికే చెందిన వారు ఉండనున్నారు. జొన్నగిరి బంగారు గనుల నుంచి 2026-27 ఆర్థిక సంవత్సరంలో 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేస్తారు. ఆ తర్వాతి ఏడాది ఉత్పత్తి సామర్థ్యాన్ని 1000 కేజీలకు పెంచుతారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని ఆ తర్వాతి దశలో 2 వేల కేజీలు ( 2 టన్నులు) పెంచాలని అధికారులు భావిస్తున్నారు.మరోవైపు జొన్నగిరిలో బంగారం ఉత్పత్తిపై ఏపీ ప్రభుత్వానికి నాలుగు శాతం రాయల్టీ లభిస్తుంది. ఈ లెక్కన మొదటి ఏడాదిలో 400 కేజీల బంగారాన్ని ఉత్పత్తి చేశారనుకుంటే.. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.57 కోట్లు రాయల్టీ రూపంలో లభిస్తుంది. అలాగే ఉత్పత్తి 900 కేజీల నుంచి వేయి కేజీల వరకూ ఉన్నప్పుడు రూ.144 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకూ ఏపీ ప్రభుత్వానికి ఆదాయం లభించనుంది. అలాగే స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. లాజిస్టిక్స్, సేవల రంగంలోనూ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

# ఎన్నాళ్లో వేచిన ఉదయంమూడో లైన్‌కు ఓకే

**గుంటూరు,** గుంటూరు - బాపట్ల జిల్లాల సరిహద్దుల్లో ఉండే వేమూరు రైల్వేస్టేషన్‌కు మంచిరోజులు వచ్చాయి. రైల్వేస్టేషన్‌లో మూడో లూప్‌లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం రూ.20.58 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో మూడో లూప్‌లైన్ నిర్మాణంతో పాటుగా ప్లాట్ ఫారంల విస్తరణ, తాత్కాలిక నిల్వకేంద్రాలు, అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నిర్ణయంతో వేమూరు, తెనాలి ప్రాంత ప్రజలకు ఉపయోగం ఉంటుందని అధికారులు చెప్తున్నారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలోని పలు రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. తాజాగా వేమూరు రైల్వేస్టేషన్ కు మంచి రోజులు వచ్చాయి. బాపట్ల-గుంటూరు జిల్లాల సరిహద్దులలో వేమూరు రైల్వేస్టేషన్ ఉంటుంది. ఈ రైల్వేస్టేషన్ మీదుగా రైళ్ల రద్దీ అధికంగా ఉంది. దీంతో గూడ్సు రైళ్లను ఆపేందుకు, సరుకు లోడింగ్ ప్రక్రియకు అంతరాయాలు కలుగుతున్నాయి.

ఈ సమస్యకు పరిష్కారం చూపించేందుకు రైల్వేశాఖ వేమూరు రైల్వేస్టేషన్‌లో మూడో లూప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదించింది. తాజాగా ఇందుకోసం రైల్వేశాఖ నిధులు కేటాయించింది. వేమూరు రైల్వేస్టేషన్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు గానూ.. మూడో లూప్‌లైన్ నిర్మాణం కోసం రైల్వేశాఖ రూ.20.58 కోట్ల నిధులు కేటాయించింది.మూడో లూప్ లైన్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే వేమూరు రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అడ్డంకులు ఉండవని అధికారులు చెప్తున్నారు. సరుకు రవాణా చేసే గూడ్స్ రైళ్లను లూప్‌లైన్‌లోకి మళ్లించి.. సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేయవచ్చని చెప్తున్నారు. దీంతో రైళ్ల రాకపోకల సమయం ఆదా కావటమే కాకుండా, సరకు రవాణా వేగం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ లూప్‌లైన్ నిర్మాణంతో ఇటు బాపట్ల, అటు గుంటూరు రెండు జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. మూడో లూప్‌లైన్ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, వేగంగా రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది.

# సంపాదకీయం

భారత శక్తి

## లక్షల లెక్కలు కాగితాలపై
## కోట్ల లెక్కలు క్షేత్రస్థాయిలో!

మనం ఎప్పుడూ కొన్ని తప్పుడు ప్రశ్నలు అడుగుతూంటాం.ఒక ఎంపీ జీతం ఎంత?ఒక ఎమ్మెల్యేకు ఎన్ని అలవెన్సులు వస్తాయి ప్రజాప్రతినిధులకు ఎన్ని సౌకర్యాలు ఉన్నాయి ఇలాంటివే సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, టీ స్టాళ్ల దగ్గర ఈ చర్చ ఎక్కువగా జరుగుతుంది. కానీ ఈ క్రమంలో అవసరమైన ఓ ప్రశ్న మాత్రం ఎక్కడో మిస్సవుతోంది. అదేంటో తెలుసా?ఒక ఎంపీ కావడానికి ఎంత ఖర్చవుతుంది? ఒక ఎమ్మెల్యే సీటు గెలవడానికి ఎంత డబ్బు ఖర్చవుతుంది అని. ఎందుకంటే ..2024 ఎన్నికల్లో భారతదేశం ఖర్చు చేసిన మొత్తం అమెరికా ఎన్నికల ఖర్చును కూడా దాటిపోయింది. అదెంత..అలా ఎలా జరిగింది అంటారా దేశం మొత్తం కలిపి 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చైన మొత్తం డబ్బు దాదాపు ?1.35 లక్షల కోట్లు అని నివేదికలు చెబుతున్నాయి. ఈ సంఖ్య ఎంత పెద్దదంటే భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రజాస్వామ్యంగా కూడా మారుతోందా అనే ప్రశ్నను లేవనెత్తే స్థాయిలో ఉంది.ఎన్నికల ఖర్చు గ్రాఫ్ 2014 30,000 కోట్లు2019 60,000 కోట్లు 2024 1,35,000 కోట్లుఅంటే? కేవలం 10 ఏళ్లలో ఎన్నికల ఖర్చు నాలుగు రెట్లు పెరిగిందిఎన్నికల సంఘం ప్రకారం ఒక లోక్‌సభ అభ్యర్థి గరిష్టంగా 95 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. ఎమ్మెల్యే అభ్యర్థులకు కూడా పరిమితి ఉంది. కాగితాలపై చూస్తే అంతా బాగానే కనిపిస్తుంది. కానీ రాజకీయాలను దగ్గరగా గమనించే వారికి ఒక విషయం స్పష్టంగా తెలుసు.ఎన్నికలు నామినేషన్‌తో మొదలవ్వవు. దానికి నెలల ముందు నుంచే మొదలవుతాయి. ప్రచారానికి టీమ్ లు , సోషల్ మీడియా టీమ్‌లు, సర్వేలు, వ్యూహకర్తలు, కార్యకర్తల నిర్వహణ, సమావేశాలు, ర్యాలీలు ఇవన్నీ అధికారిక లెక్కల్లో కనిపించవు.అందుకే ఒక తీవ్రమైన పోటీ ఉన్న ఎంపీ స్థానం కోసం 30 కోట్ల నుంచి 50 కోట్ల వరకు ఖర్చవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో కూడా ఖర్చు 10 కోట్ల నుంచి 25 కోట్ల వరకు వెళ్తోందని అంచనాలు ఉన్నాయి.ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే పోస్టర్లు, పాంప్లేట్లు, కొన్ని సభలు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ వార్ రూమ్స్. డేటా అనలిటిక్స్. మీడియా ప్రకటనలు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు. ప్రత్యేక పీఆర్ టీమ్ లు. హెలికాప్టర్లు. భారీ కాన్వాయ్‌లు. వేలాది మంది కార్యకర్తల నిర్వహణ. ఇవన్నీ చూస్తే ఎలక్షన్స్ ఇప్పుడు కార్పొరేట్ మార్కెటింగ్ క్యాంపెయిన్ గా అనిపిస్తున్నాయి.ఖచ్చితంగా చెప్పాలంటే ?ఒక కంపెనీ తన ఉత్పత్తిని అమ్మడానికి ఎంత ప్లాన్ చేస్తుందో? రాజకీయ పార్టీలు కూడా ఓటును పొందడానికి అంతే ప్రణాళికతో పనిచేస్తున్నాయి.సంఖ్య వినడానికి పెద్దగా అనిపిస్తుంది. కానీ దాని పరిమాణం అర్థం కావాలంటే మరో కోణంలో చూడాలి. ఆ డబ్బుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించవచ్చు. వందలాది ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించవచ్చు. లక్షల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించవచ్చు. కానీ ఆ మొత్తం డబ్బు కేవలం కొన్ని వారాల ఎన్నికల ప్రచారంలో ఖర్చయిందంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇవి లేకుండా ఎన్నికలలో పోటీ చెయ్యలేమా అంటే..పోటీ ప్రపంచంలో తప్పదు అంటారు.ఎన్నికల సమయంలో నగదు, మద్యం, బంగారం, బహుమతులు పట్టుబడ్డాయనే వార్తలు మనం తరచూ చూస్తుంటాం. కానీ వాటి మొత్తం విలువ ఎప్పుడైనా గమనించారా?2019 ఎన్నికల్లో సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం, డ్రగ్స్ తదితర వస్తువుల విలువ 3,477 కోట్లు.2024లో అది 10,000 కోట్లకు పైగా చేరింది.అంటే ఐదేళ్లలో దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఇక్కడ మరో ప్రశ్న కూడా ఉంది. పట్టుబడింది ఇంత ఉంటే పట్టుబడనిది ఎంత ఉంటుంది? ఒక్క సారి ఆలోచించండి.మనం ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు వెళ్తాం. కొన్ని నిమిషాల్లో పని అయిపోతుంది.

కానీ ఆ ఒక్క ఓటు కోసం రాజకీయ వ్యవస్థ ఎంత ఖర్చు పెడుతోందో లెక్కలు తెలిస్తే మతిపోతుంది. అంచనాల ప్రకారం 2024 ఎన్నికల్లో ఒక్కో ఓటరుపై సగటున దాదాపు 1,400 ఖర్చయింది. అంటే నలుగురు ఓటర్లు ఉన్న ఒక కుటుంబం కోసం సగటున 5,600.ఒక ఓటు కోసం ఇంత ఖర్చు పెట్టే వ్యవస్థ? ఆ ఓటు వెనుక ఉన్న పౌరుడి జీవితాన్ని మెరుగుపరచడానికి ఎంత ఖర్చు పెడుతోంది? అని.ప్రజాస్వామ్యం అందరికీ అవకాశం ఇవ్వాలి. కానీ ఎన్నికలు రోజు రోజుకీ మరింత ఖరీదైనవిగా మారుతున్న కొద్దీ ఒక ప్రమాదం పెరుగుతోంది. సామర్థ్యం ఉన్నవాళ్లు కాదు సంపద ఉన్నవాళ్లు ముందుకు వచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.ఎన్నికలు అంటే అభ్యర్థుల మధ్య పోటీగా కాకుండా ఆర్థిక శక్తుల పోటీగా మారే ప్రమాదం వచ్చేసింది. ఈ క్రమంలో రాజకీయాల్లోకి రావాలనుకునే ఒక సాధారణ ఉపాధ్యాయుడు, ఒక రైతు, ఒక సామాజిక కార్యకర్తకు నిజంగా అవకాశం ఉంటుందా?అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే నాయకుల జీతాలను మాత్రమే కాదు? ఎన్నికల్లో ప్రవహిస్తున్న డబ్బును కూడా ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ హయాంలో చెరువులన్నీ కబ్జా: మధుయాష్కి గౌడ్





ముఖ్యంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తన అనుచరులతో కలిసి చెరువు స్థలాలను నిలువునా కబ్జా చేయించారని ఆరోపించారు. బుధవారం ఉదయం ఆయన ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బైరామల్‌గూడ చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పురపాలక అధికారులతో సమీక్షించారు.

### ఆరు ఎకరాల చెరువు.. రెండు ఎకరాలకే పరిమితం!

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. ఒకప్పుడు ఆరు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అలరారిన బైరామల్‌గూడ చెరువు, కబ్జాకోరుల చేతుల్లో నలిగి ఇప్పుడు కేవలం రెండు ఎకరాలకే పరిమితం కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అండదండలతోనే ఈ భూదందా సాగిందని దుయ్యబట్టారు. ఈ అక్రమణలపై వెనక్కి తగ్గేదే లేదని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు 'హైడ్రా' (హైడ్రా) సంస్థకు త్వరలోనే అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కబ్జాకు గురైన ప్రతి ఇంచ్ చెరువు స్థలాన్ని ప్రభుత్వ యంత్రాంగం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు.

### రూ. 10 కోట్లతో ఆధునీకీకరణ.. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు, అభివృద్ధికి కట్టుబడి ఉందని మధుయాష్కి తెలిపారు. బైరామల్‌గూడ చెరువు వద్ద ప్రస్తుతం రూ. 2.60 కోట్లతో సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ చెరువు సమగ్ర అభివృద్ధి కోసం మొత్తం రూ. 10 కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు."బైరామల్‌గూడ చెరువు పైభాగం నుంచి వచ్చే వరద నీరు నేరుగా సరూర్ నగర్ చెరువులోకి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. ఈ పనులు పూర్తయితే పరిసర కాలనీల ప్రజలకు దశాబ్దాలుగా వేధిస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది." పరిశీలన సందర్భంగా స్థానికులు తమ దృష్టికి తెచ్చిన పలు ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, వాటి పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అక్కడికక్కడే అధికారులకు సూచించారు.

### ప్రభుత్వ పాఠశాల పరిశీలన.. నూతన భవనానికి హామీ

చెరువు పరిశీలన అనంతరం బైరామల్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మధుయాష్కి గౌడ్ సందర్శించారు. పాఠశాలలోని పాతబడిన తరగతి గదులను, మౌలిక వసతులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఇక్కడ నూతన పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అప్పటివరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టాలని స్థానిక నాయకులను పురమాయించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ (డిప్యూటీ కమిషనర్) శ్రీనివాస్, కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) కార్తీక్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, నాయకులు కుట్ల నర్సింహా యాదవ్, వేణుగోపాల్ యాదవ్, కర్మాన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, జిట్టా సురేందర్ రెడ్డి, రఘుమారెడ్డి, గ్యారగోని ప్రవీణ్ గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దేరంగుల కృష్ణ, బద్రీనాథ్, భాను, అనసూయ, సరిత, విజయ్ కుమార్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, గణేష్ రెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, కందికంటి శ్రీధర్, దాము మహేందర్ యాదవ్, రమాకాంత్ గుప్తా, శ్రీనాథ్, కొండోజు శ్రీనివాస్, ఎనుముల రవీందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, భవాని శంకర్, మతిన్ షరీఫ్, కోటగిరి శ్రీనివాస్ గౌడ్, శశికాంత్, అంతటి శ్రీనివాస్ గౌడ్, బండిగారి అశోక్ గౌడ్, నరేష్ గుప్తా, బండిగారి శ్రీనివాస్ గౌడ్, సాయినికేష్, నంద కిషోర్, సాయి కిరణ్, తోకటి కిరణ్, రేణు గౌడ్, సాయి, సురేష్ యాదవ్, మణిశ్రీ, షేక్ షాకీర్, ఇర్ఫాన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొరపాటున పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం

సమాచారం అందించామని, సంస్థాగతంగా కూడా అంతర్గత విచారణ జరుపుతున్నామని ఎయిరిండియా పేర్కొంది. ప్రయాణికుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసింది. 2025 ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి, సరిహద్దు ఉద్రిక్తతల తర్వాత పాకిస్థాన్.. భారత్‌కు చెందిన అన్ని రకాల సివిల్, మిలటరీ విమానాలపై తమ గగనతలాన్ని మూసివేసింది. ఈ నిషేధాన్ని నెలనెలా పొడిగిస్తూ వస్తోంది. ఇటీవలే ఈ నిషేధాన్ని జూలై 24 వరకు పొడిగించినట్లు పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. భారత్ కూడా పాక్ విమానాలపై ఇదే తరహా నిషేధాన్ని అమలు చేస్తోంది. ఈ నిషేధం కారణంగా ఎయిరిండియా, ఇండిగో వంటి భారత విమానయాన సంస్థలు యూరప్, ఉత్తర అమెరికా, మధ్య ఆసియా దేశాలకు వెళ్లేందుకు సుదీర్ఘమైన, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులు పెరిగి సంస్థలపై కోట్ల రూపాయల ఆర్థిక భారం పడుతోంది.

# పాలనపై పట్టు తప్పుతోందా...

**విజయవాడ** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈ దఫా ఎందుకో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాలనను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంపై పూర్తిగా గ్రిప్ కొరవడినట్లుంది. గతంలో ముఖ్యమంత్రిగా చూసిన చంద్రబాబుకు, నేటి చంద్రబాబుకు చాలా తేడా ఉంది. ఈ మాట పార్టీ నేతలే చెబుతున్నారు. జగన్ ను రాజకీయంగా బలహీనం చేయాలన్న ఆలోచన తప్ప పార్టీకి అండగా ఉన్న వారిని తమ వెంటనే ఉంచుకునే విషయంలో మాత్రం విఫలమవుతున్నారనిపిస్తుంది.

అయితే చంద్రబాబు కు ఇది తెలియంది కాదు. వచ్చే ఎన్నికల్లో ఇటు పవన్ కల్యాణ్ మద్దతు, అటు బీజేపీ అండతో గెలుస్తామన్న ధీమాతోనే అలా వ్యవహరిస్తూ ఉండి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. విజయవాడ సాయికృష్ణ వ్యవహారాన్ని సరిగ్గా ప్రభుత్వం డీల్ చేయలేక పోయింది. అనవసర తల నొప్పిని కొని తెచ్చుకున్నట్లయింది. ఆదిలోనే చర్యలకు దిగి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. సాయికృష్ణ వ్యవహారంలో ప్రధాన కారకులైన పోలీసులను సస్పెండ్ చేసి ఉంటే ఇంత నష్టం జరిగి ఉండేది కాదు. అలాగే ఈ విషయంలో అసలు నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. చివరకు చంద్రబాబు రంగంలోకి దిగే వరకూ చర్యలు తీసుకోలేదు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ వ్యవహారాన్ని లైట్ తీసుకున్నారు. చివరకు సిట్ ను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. సంఘటన తెలిసిన వెంటనే సమర్థుడయిన టీడీపీ నేతను ఆ కుటుంబం వద్దకు పంపి ఉంటే బాగుండేది. వంగవీటి రాధా కృష్ణ లాంటి నేతలయితే మరింత బాగుండేదన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతుంది. వంగవీటి రాధా వెళ్లి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదంటున్నారు.

# భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

**ముంబై,** ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం యావత్ ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. చమురు సరఫరాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడడంతో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరి, ఇంధన, వాణిజ్య సంక్షోభం తలెత్తేలా కనిపించింది. కానీ తాజాగా అమెరికా- ఇరాన్ మధ్య జరిగిన శాంతి ఒప్పందంతో చమురు ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి77.39 డాలర్లు వద్ద ట్రేడ్ అవుతుంటే.. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు వి73.57 వద్ద ట్రేడ్ అవుతోంది.అయితే ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో, ప్రపంచవ్యాప్తంగా చమురు నిల్వలు అవసరానికి మించి పెరిగిపోతాయని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. రాబోయే రెండేళ్లలో ప్రపంచ చమురు సరఫరా, డిమాండ్ కంటే చాలా వేగంగా పెరుగుతుందని, తద్వారా 2027 నాటికి చమురు మిగులు ఏర్పడుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో జరిగిన యుద్ధం కారణంగా రోజుకు 14 మిలియన్ బ్యారెళ్ల (ఎజూట) చమురు ఉత్పత్తి నిలిచిపోయిందని ఎఇం అంచనా వేసింది.క్రిస్టల్ ఎనర్జీ గ్లోబల్ అడ్వైజర్ క్రిస్టోఫ్ రూహ్ల్ అభిప్రాయం ప్రకారం.. 2027 నాటికి ప్రపంచ సరఫరా, డిమాండ్ కంటే రోజుకు 1 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయే అవకాశం ఉంది. దీని ప్రభావంతో భారత్‌లో ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని గేట్‌వే హౌస్‌లో ఎనర్జీ, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కనెక్టివిటీ సీనియర్ ఫెలో అమిత్ భండారీ తెలిపారు. అయితే ఈ తగ్గదల అనేది తక్షణమే ఉండకోవచ్చని.. దానికి దాదాపు 5-6 నెలల సమయం పడుతుందన్నారు.

అంతేకాదు రాబోయే రోజుల్లో ప్రపంచ ఇంధన మార్కెట్లలో భారీ మార్పులు రాబోతున్నాయని నిపుణులు అంటున్నారు. 2027 నాటికి ప్రపంచ చమురు సరఫరా రోజుకు సుమారు 8 మిలియన్ బ్యారెళ్లు పెరుగుతుందని, కానీ డిమాండ్ కేవలం 2 మిలియన్ బ్యారెళ్లు మాత్రమే ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని వల్ల ప్రపంచ మార్కెట్‌లో భారీ ఎత్తున చమురు మిగులు ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఇది ప్రపంచ దేశాలకు ఎంతగానో ఉపశమనాన్ని కలిగిస్తోందని.. ఇది ధరలను తగ్గించడమే కాకుండా.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఏర్పడి కొరతను ఫుల్‌ఫిల్ చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు.అమెరికా-ఇరాన్ ఒప్పందం ఇలాగే కొనసాగితే గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు క్రమంగా పుంజుకుంటాయని ఎఇం భావిస్తోంది. శాశ్వత ఒప్పందం కుదిరి, ఇరాన్ ఎగుమతులపై ఆంక్షలు తొలగిపోతే, మరింత ముడి చమురు అంతర్జాతీయ మార్కెట్లలోకి వస్తుంది. ఇది సరఫరాను మరింత మెరుగుపరిచి, చమురు ధరలపై ఉన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొంది




## వైభవంగా సామూహిక షష్టిపూర్తి వేడుకలు



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి): మంచిర్యాల పట్టణంలోని గోదావరి నది తీరంలో గల శ్రీ గౌతమేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో అర్చకులు బ్రహ్మశ్రీ గడియారం బాలాజీ శర్మ స్వీయ పర్యవేక్షణలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవాన్ని బుధవారం వైభవపేతంగా నిర్వహించారు. గౌతమేశ్వర రమా సహిత సత్రాయన స్వామి దేవాలయంలో బుధవారం రోజున నుంచి మూడు రోజులపాటు సామూహిక ఉగ్రత షష్టిపూర్తి మహోత్సవాన్ని ఉదయం 8 గంటల నుంచి వేద మంత్రాల నడుమ ఐదు జంటల తో నిర్వహించారు. మొదటిరోజు గణపతి పూజ నవగ్రహ పూజ షష్టిపూర్తి మహోత్సవ మండప స్థాపన కలశాల ఆరాధన అనంతరం 108 ఉతక స్నానాలతో షష్టిపూర్తి జరుపుకునే జంటలతో అర్చక బృందం నిర్వహించారు. గురువారం రెండవ రోజు శుక్రవారం మూడవరోజు మహా చండీ హోమం తదితర కార్యక్రమాలతో పూర్ణాహుతి ఆశీర్వాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సామూహిక ఉగ్రరథ షష్టిపూర్తి మహోత్సవంలో ఆలయ నిర్వాహకురాలు గోపగాని శ్రీదేవి, వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, కోశాధికారి కొంకుమొట్టి వెంకటేష్, పిఆర్ఓ ఉత్తూరి రమేష్, జోన్ చైర్ పర్సన్ లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్లా సూర్యనారాయణ, వనిత వేంపల్లి అధ్యక్షురాలు పడకండి రజిత, కార్యదర్శి కుక్కుడపు గాయత్రి, నస్పూర్ మండల్ కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్‌లో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతుల మీదుగా అబాకస్ సెంటర్, స్నూకర్ పార్లర్ ప్రారంభం



ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 24: బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో ఎల్. శెట్టి సుస్వాస్ మౌనిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అబాకస్ సెంటర్‌ను, అలాగే మురళి, శరత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్నూకర్ పార్లర్‌ను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ, అబాకస్ విద్య విద్యార్థుల్లో మేధో వికాసం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అలాగే స్నూకర్ వంటి ఇండోర్ క్రీడలు యువతలో ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బోడుప్పల్ ప్రాంతంలో విద్యా, క్రీడా రంగాలకు సంబంధించిన ఆధునిక వేదికలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొంటూ, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అశోక్ నగర్ కాలనీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, యువత, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు



కుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 24: తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ. 1 కోటి నిధులు, మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో మంజూరు కావడం పట్ల, ఈరోజు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని కుర్మ సంఘ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షులు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ అధ్యక్షులు బాలయ్యా, పెంటయ్యా, సెల్వియోజి సత్తయ్యా, చిన్న సత్తయ్యా, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



శంషిగూడ డివిజన్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 24: శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆశ నగర్ కాలనీ హైటెన్షన్ రోడ్డులో కోటి రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పి.ఎ.సి చైర్మన్ అరికేపూడి గాంధీ సహకారంతో డివిజన్ లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఆశా నగర్ హైటెన్షన్ లైన్ లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల్, లింగం, నాగేష్ గౌడ్, సత్తయ్య, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవుట్ రీచ్ కార్యక్రమం

## - ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ 5.0 పై అవగాహన సదస్సు





విజయవాడ, జూన్ 24(భారత శక్తి ): పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా చిన్న, మధ్యతరహా దజూశ్నీ, మధ్యతరహా పరిశ్రమలకు (మీవీజుం) రుణ సదుపాయం కల్పించనున్నట్లు బ్యాంకు అధికారులు వివరించారు. అదేవిధంగా, జన్‌సమర్థ్ పోర్టల్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అర్హులైన అభ్యర్థులు తక్కువ వడ్డీతో రుణాలు పొందవచ్చని తెలియజేశారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీజీటీసీ (చీజ+ఙజ) ఏజీఎం హేమంత్ కుమార్ జుజూ+టా 5.0 పథకంపై పలు సూచనలు చేశారు. అలాగే, జన్‌సమర్థ్ ప్రాజెక్ట్ లీడ్ అధికారి సిద్ధార్థ్ కొట్నాన జన్‌సమర్థ్ పోర్టల్ ద్వారా మీవీజు రుణాల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించడంతో పాటు, వ్యాపారవేత్తల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు పాల్గొని, వ్యాపారవేత్తలకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. అదేవిధంగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ మరియు ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ కె. శ్రీధర బాబు ఈ పథకం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు ఈ పథకం అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల శాఖ (ణఖీూ) డిప్యూటీ సెక్రటరీ శ్రీమతి గరిమా కపూర్, ణఖీూ అండర్ సెక్రటరీ కుమార్ శైలేంద్ర, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి జనగం, డీఐసీ జనరల్ మేనేజర్ ఎం. మధు, ఎన్‌సీజీటీసీ ఏజీఎం హేమంత్ కుమార్, జన్‌సమర్థ్ ప్రాజెక్ట్ లీడ్ అధికారి సిద్ధార్థ్ కొట్నాన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎన్టీఆర్ జిల్లా, వివిధ బ్యాంకుల అధికారులు, ఎంఎస్ఎంఈ కస్టమర్లు మరియు పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**- బద్వేలు మున్సిపాలిటీలో స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థకు రూపకల్పన**



కడప, జూన్ 24 (భారత శక్తి ): కడప నగరంలో అధునాతన సాంకేతికతతో నాణ్యమైన నీటి సరఫరా వ్యవస్థతో పాటు పచ్చదనం, పరిశుభ్రతను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, బ్యూటిఫికేషన్ లతో పాటు బద్వేలు మున్సిపాలిటీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన "స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థ"ను అమలు చేసేందుకు చేపట్టిన ప్రణాళికలపై కడప నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎస్. భావన తోపాటు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరుల సమర్థ వినియోగం, నీటి నష్టాల నివారణ, ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. బద్వేలు మున్సిపాలిటీలో ప్రతిపాదించిన విధానాన్ని పరిశీలించి కడప నగరంతో పాటు ఇతర మున్సిపాలిటీల్లోనూ అమలు చేసే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఆయా పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థ, మౌలిక వసతులు, సాంకేతిక అవసరాలపై నివేదిక సిద్ధం చేయాలని కమిషనర్లను ఆదేశించారు. బద్వేలు మున్సిపాలిటీలో నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మార్చే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించబడిందని ప్రతినిధులు తెలిపారు. జలాశయాలు, జాక్‌వెల్‌లు, పంపు కేంద్రాలు, జల శుద్ధి కేంద్రాలు, నిల్వ ట్యాంకులు, పంపిణీ పైపులైన్ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేసి నీటి మట్టాలు, ప్రవాహం, పీడనం, నీటి నాణ్యతను నిరంతరం పరిశీలించే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు. నీటి లీకేజీలు, పైపు పగుళ్లు, ట్యాంకుల పొంగిపొర్లడం, పంపుల లోపాలు వంటి సమస్యలను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు హెచ్చరికలు పంపే సదుపాయం ఉంటుందని తెలిపారు. దీంతో నీటి నష్టాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నిర్వహణ వ్యయాలను కూడా నియంత్రించవచ్చని చెప్పారు. అలాగే జల శుద్ధి కేంద్రాల నుంచి ప్రజలకు చేరే వరకు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నీటిలో క్లోరిన్ స్థాయిలు, ఆమ్ల-క్షార సమతుల్యత, మసకదనం తదితర ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణ నీటి సరఫరా వ్యవస్థలో నీటి లీకేజీలు, నీటి నాణ్యత పర్యవేక్షణలో లోపాలు, అధిక విద్యుత్ వినియోగం, పరికరాల లోపాలను ఆలస్యంగా గుర్తించడం, మానవ ఆధారిత నిర్వహణ వంటి సమస్యలు ఉన్నాయని వివరించారు. వీటికి పరిష్కారంగా అంతర్జాల అనుసంధాన పరికరాల ఆధారిత సమగ్ర పర్యవేక్షణ వ్యవస్థను ప్రతిపాదించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కడప నగరంలో స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థను అమలు చేసే అవకాశాలను పరిశీలించి, ఆయా పట్టణాల్లో ఉన్న అనుకూల పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే కడప నగరంలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, రోడ్లు, ప్లాంటేషన్, సుందరీకరణ, పచ్చదనం - పరిశుభ్రత మెరుగుపై దృష్టి సారించాలని కార్పోరేషన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫర్విడ్ స్మార్ట్ సంస్థ ప్రతినిధులు ప్రతిపాదిత వ్యవస్థకు సంబంధించిన సాంకేతిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రత్యక్ష పర్యవేక్షణ కేంద్రం ద్వారా అన్ని జల వనరులు, పంపిణీ వ్యవస్థల పనితీరును ఒకే వేదికపై పరిశీలించే అవకాశం కలుగుతుందని, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించే విధంగా హెచ్చరిక వ్యవస్థ పనిచేస్తుందని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో కడప, బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారులు మురళి, చంద్రమోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. ఏడుకొండలు, కెఎంసి ఎస్.ఈ. చెన్నకేశవరెడ్డి, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, బద్వేలు మున్సిపల్ కమిషనర్ కృష్ణా, డీఈ సుమంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవసేవ సేవ దృక్పథంతో ప్రతి ఒక్కరు పని చేయాలి.

**-రంగయ్య పల్లె సర్పంచ్ జములాపురం మోహన్ రావు**



రేగొండ, జూన్ 24 (భారత శక్తి):మానవ సేవే మాధవసేవ అని ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో పనిచేయాలని గ్రామ సర్పంచ్ జములపురం మోహన్ రావు అన్నారు, బుధవారం రోజున జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం క్షేత్ర సిబ్బంది లంసాని రమాదేవి నిర్వహించినటువంటి మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాదృక్పథంతో ముందు ఉండాలని అనుక్షణం ఆ భగవంతుడు ఆశీస్సులు సేవ రూపంలో అందుతాయని ఈ గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ కి సహకరించిన ఆజర హాస్పిటల్ యాజమాన్యానికి మరియు లయన్స్ క్లబ్ యాజమాన్యాన్ని అభినందిస్తూ వారి సేవా దృక్పథాన్ని కొనియాడారు . గ్రామంలోఅనేకమంది అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న సందర్భంలో ఈ ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారూల సంఘం గ్రామంలో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించి సేవ దృక్పథాన్ని అభినందించారు ఇలాంటి కార్యక్రమాలు గ్రామంలోఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగపర్చుకొని ఆరోగ్య సమస్యలకు వైద్య నిపుణుల చేత సలహాలు సూచనలు పాటించాలని వారు అందించేటువంటి మెడిసిన్స్ తూచా తప్పకుండా ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాలైనటువంటి ఆరోగ్య సమస్యలకు పురుషులు 98 మంది స్త్రీలు 84 మంది వైద్య సలహాలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా అవసరమాగు మందులను స్వీకరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆజర హాస్పిటల్ యాజమాన్యం మరియు లయన్స్ క్లబ్ కంటి పరీక్ష పరీక్ష నిర్వాహకులు వెంకటనారాయణ, ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది మహమ్మద్ చంద్‌పాషా ,అఖిల్ రచన మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి గ్రామస్తులు పాల్గొన్నారు

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**: సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్రా శ్రావణ్**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి ): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి 25 వ వార్డు లో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాలను (కె జి బి వి )నేడు సెంటర్ ఫర్ ఎకనామిక్స్ మరియు సోషల్ స్టడీస్ వారు ఇన్వెస్టిగేటర్ జె సంపత్ ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ పర్సన్ మరియు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా నర్రా శ్రావణ్ మాట్లాడుతూ ప్రతి వర్షాకాల సమయంలో కృష్ణ కుంట కు సమీపంలో లో లెవల్ లో కస్తూర్బా గాంధీ పాఠశాల నిర్మించడం వలన పైనుండి వచ్చే వరద నీరు పాఠశాల లోపలికి చేరడం ద్వారా చదువుకునే విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని అన్నారు. కావున బయట నుండి పాఠశాలలోకి వరద నీరు రాకుండా బయట ఉండే నేల కంటే పైకి మట్టి లేదా మొరం పోయాలని అన్నారు దాని వలన పాఠశాల లోపలికి వరద నీరు చేరకుండా ఉంటుందని అన్నారు. పాఠశాల నందు ప్రస్తుతం తాత్కాలిక వంట మనుషులు వంట చేస్తున్నారని శాశ్వత వంట మనుషులను కనీసం ఐదుగురిని నియమించాలని మరియు ఒక స్కావెంజర్ ని కూడా నియమించాలని డిమాండ్ చేశారు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కేజీబీవీ పాఠశాల నుండి ఇంటర్మీడియట్ కళాశాల వరకు అప్గ్రేడ్ కావడం వలన పాఠశాల యొక్క తగిన ఇన్ఫ్రా స్ట్రక్చర్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల మరియు కళాశాలకు ఉపాధ్యాయులు పిల్లలు పిల్లల తల్లిదండ్రులు రాకపోకలకు రోడ్లు సరిగా లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కేజీబీవీ తరఫున నిధులు కేటాయించి రోడ్లు వేయించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ లో నుండి మురుగునీరు బయటికి వెళ్ళుటకు చాలా ఇబ్బందికరంగా ఉన్నందున వెంటనే కస్తూర్బా గాంధీ చుట్టూ సైడ్ డ్రైన కోసం కస్తూర్బా గాంధీ పాఠశాల మరియు కళాశాల నిధుల కేటాయించవలసిందిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపల్ బొడ్డు భవాని గారు, కమ్యూనిటీ పర్సన్స్ మంద శంకర్, తండా శ్రీనాథ్, సోషల్ ఆడిట్ చేసిన వారిలో సిహెచ్ శ్రీనివాస్, జి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# మంకీ రెస్క్యూ సెంటర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ గ్రామంలోని గండిరామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పట్టుకున్న కోతులు, పునరావాసం, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



భారత శక్తి, జూన్ 24 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఏఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని ఏఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీల దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్ శిక్షణా శిబిరాన్ని గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట గ్రామ సర్పంచ్ కళ్లెం జహంగీర్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ధర్మారెడ్డిగూడెం సర్పంచ్ కొల్లూరి రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ ను తొలగించాలని ధర్నా

**-రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య**



భారత శక్తి, జూన్ 24 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్ ను తొలగించి గతంలో మాదిరిగానే రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరుతూ యాదగిరిగుట్ట మండల తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా గురించి రైతులకు అర్థం కాకుండా యాప్ లను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తుందని వెంటనే యూరియా యాప్ ను తొలగించాలని, రైతాంగానికి ఉపయోగపడే కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, రైతులు ఎన్ని ఎకరాలకు సాగు చేస్తే అన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 30లోగా రైతులందరి ఖాతాల్లోకి రైతు భరోసా జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, రైతు సంఘం జిల్లా నాయకులు కల్లేపల్లి మహేందర్, కంబాల వెంకటేష్, రైతులు కొండయ్య, నరసింహారెడ్డి, అండాలు, వడ్లకొండ మధు, మిట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ముందుకు కొనసాగిస్తాం

**- నేటి యువత నేతాజీ స్ఫూర్తితో ముందుకు కొనసాగాలి.**

**- ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ముందుకు సాగుతాం.**



నల్లగొండ, భారత శక్తి న్యూస్, జూన్ 24: బలమైన, ఐక్యమైన మరియు స్వయం సమృద్ధమైన భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్థాపించిన 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ' యొక్క 87వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ రోజు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము తెలిపారు. గత 87 ఏళ్లుగా, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయవాదం, సామాజిక న్యాయం, లౌకికవాదం మరియు సామాన్య ప్రజల అభివృద్ధి సాధికారత పట్ల తన నిబద్ధతకు కట్టుబడి నిలిచింది. నేతాజీ ఆశయాల నుండి స్ఫూర్తిని పొందుతూ, ప్రగతిశీల, సమానత్వంతో కూడిన మరియు సంపన్నమైన దేశ నిర్మాణం దిశగా మనం కృషిని కొనసాగిద్దాం అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.
ఏకం అవ్వండి! పోరాడండి! భారతదేశాన్ని పునర్నిర్మించండి --- నేతాజీ మార్గంలో జై హింద్!
ఈ కార్యక్రమంలో టియుసిసి జిల్లా కన్వీనర్ ఎండి జలీల్ బాబా, ఆదినారాయణ, ఏఐవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, నాగరాజు, ఏఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి నశీర్ బాబా, సమీర్, అంజి, ఏఐఏఎంఎస్ జిల్లా కన్వీనర్ లక్ష్మీదేవి, దుర్గమ్మ, ఏఐఏకేఎస్ జిల్లా నాయకులు మహమ్మద్ గౌస్, రమేష్, చారి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తాం

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీ**

**- టీయుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులతో చర్చలు సఫలం**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 24: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జర్నలిస్టు ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డిపిఆర్ఓ) నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. టీయుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులు ధర్నాకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. కలెక్టర్ దృష్టికి డిపిఆర్వో సమస్యలు డిపిఆర్వో వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జర్నలిస్టులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఆమోదం పొందిన 273 అక్రిడిటేషన్ కార్డులలో కొన్నింటిని మాత్రమే పంపిణీ చేసి, మిగతా కార్డుల జారీకి డిపిఆర్వో లేనిపోని కొర్రీలు పెడుతున్నారని వివరించారు. బస్ పాసుల విషయంలోనూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు డిపిఆర్వోను తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని, లేదా సంబంధిత శాఖకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందుతాయని హామీ ఇచ్చారు. అలాగే డిపిఆర్వో వైఖరిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### "అదనపు కలెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలు"

అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియను పర్యవేక్షించి, వెంటనే కార్డులు జారీ చేయాల్సిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరిని కలెక్టర్ ఆదేశించారు. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో చర్చించి, అర్హులైన వారందరికీ త్వరితగతిన కార్డులు అందేలా చూడాలని సూచించారు. కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ లభించడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.



### భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు

ఈ చర్చల కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వి. రజినీకాంత్, కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి జర్నలిస్టులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

# ప్రతి సంక్షేమ పథకం పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

**"ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి అన్నారు. "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 99 రోజుల ప్రణాళికలో శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఫోటో గ్యాలరీని కలెక్టర్, అధికారులతో కలిసి తిలకించారు. శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, అన్ని శాఖలు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు అన్ని శాఖల అధికారులు విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాఖల వారీగా సంబంధిత పథకాలు, సంక్షేమ ఫలాలు అన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు చేరే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. స్పష్టమైన ప్రణాళికతో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు వెల్లడించిన నివేదికలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో అధికారులు ముందుకు సాగాలన్నారు.

**- ప్రజల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల**



**కృషితోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" విజయవంతం: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్ర**

ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమం, రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్య, సంస్కృతిక, పర్యావరణ వారోత్సవాల పేరిట విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి




అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించినట్లు వివరించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, అధికారుల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని పంటలను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ కు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - బీఎల్ఏలకు రాజకీయ పార్టీలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.**

**- ప్రతి ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాలు, ప్రస్తుత పాస్ పోర్టు సైజ్ ఫొటో కూడా బీఎల్ఓలకు అందించాలి**

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల, భారత శక్తి, జూన్ 24: జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ నెల 25 వ తేదీ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 55 మంది బీఎల్ఓ సూపర్ వైజర్లు, 549 మంది బీఎల్ ఓ లు ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో 4,75,694 మంది ఓటర్లు ఉండగా, 2,28,579 మంది పురుషులు, 2,47,072 మహిళలు, 43 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారని వెల్లడించారు. వీరిలో 4,04,414 మంది మ్యాపింగ్ పూర్తి అయిందని, ఇంకా 71,280 మంది ఇంకా మ్యాపింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్ల అందరికీ బీఎల్ఓలు ఈ నెల 25 వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని పేర్కొన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని, అలాగే ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తప్పనిసరిగా జూలై 31వ తేదీలోగా అందజేసి రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్వో ఎవరో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారాలు నింపడంలో సహాయం అందించాలని ఆదేశించారు. ఫారాలతో పాటు ఎలాంటి గుర్తింపు కార్డుల జిరాక్స్ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డు వివరాలు బీ ఎల్ ఓ లకు ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ 31వ తేదీ జూలై రోజున పబ్లిష్ అవుతుందని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు.

ఆ సమయంలో భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని ఆధారంగా తీసుకుని అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్వోలు మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు జశీవతీ.వఎఱ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని




పూరించవచ్చని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి.. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో అర్హులైన ఓటరు ఒకే చోట ఓటు హక్కు కలిగి ఉండాలనేది ఎన్నికల సంఘం లక్ష్యమని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఒక చోట కాకుండా ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉండడం నేరమని తెలిపారు.

ఇంటింటి సర్వే సమయంలో బీఎల్వోలకు బీఎల్ఏలు సహకరించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, సరైన పత్రాలతో ఫారాలు నింపడంలో సహాయం చేయాలని సూచించారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలోని ఓటర్లు అందరూ తమ వద్దకు వచ్చే బీ ఎల్ ఓ లకు సహకరించి.. తమ వివరాలు, ఫారాలు అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారి ఇలంబర్తికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా







నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ఇలంబర్తికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎఫ్వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్



జగిత్యాల, జూన్ 24 (భారత్ శక్తి): ధర్మపురి పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బండారి శంకర్, దీప దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, వార్డు కౌన్సిలర్ చిపిరిశెట్టి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గృహప్రవేశం నిర్వహించిన కుటుంబ సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా చూడాలి**

**-కాంగ్రెస్ కార్యకర్తలు, బిఎల్‌ఏలు సమన్వయంతో పని చేయాలి**

**- బిఎల్‌ఏల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**





భారత శక్తి, జూన్ 24 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ూ×=) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్ల(దీూూ) కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు వివరాల సవరణ వంటి అంశాలపై బూత్ స్థాయి ఏజెంట్లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతీ అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా దీూూలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. అలాగే ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, దీూూలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గారు "చాత్రింకి గుంజ్" కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. అలాగే సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన అవకతవకల కారణంగా ఎంతో మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురై, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారని, ప్రతీ విద్యార్థికి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, పేపర్ లీకేజీలకు శాశ్వతంగా చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో రేపు నిర్వహించే "చాత్రింకి గుంజ్" కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, దీూూలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నాయకుల సందేహాలను నివృత్తి చేసి,కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి ధర్మపురి ఎస్ఐ మహేష్



జగిత్యాల, జూన్ 24 (భారత్ శక్తి): ధర్మపురి మండలంలోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి ఎస్ఐ జి. మహేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, నైతిక విలువలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మపురి విద్యాభివృద్ధికి హెచ్‌ఏఎల్ చేయూత

**సీఎస్ఆర్ నిధులతో రూ.10 కోట్ల డిగ్రీ కళాశాల భవనం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషికి ఫలితం**



జగిత్యాల, జూన్ 24 (భారత్ శక్తి): ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద రూ. 10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది.సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెచ్‌ఏఎల్ ప్రతినిధులు, జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, హెచ్‌ఏఎల్ ప్రాజెక్టుల విభాగం ప్రధాన అధికారి ఎ.వి. మురళీకృష్ణ, మానవ వనరుల విభాగ ఉప ప్రధాన నిర్వాహకుడు సూర్యకాంత్ రౌత్, మానవ వనరుల విభాగ సీనియర్ మేనేజర్ ఎస్. సత్యనారాయణ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధే సమాజ పురోగతికి మూలాధారమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ఈ కళాశాల ఉపయోగపడనుందని తెలిపారు.ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, డిజిటల్ అభ్యాస సదుపాయాలతో కళాశాల భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో విద్యారంగానికి సహకరిస్తున్న హెచ్‌ఏఎల్ యాజమాన్యానికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మంత్రి ఓఎస్డి విజయ్ కుమార్, జిల్లా అధికారులు, హెచ్‌ఏఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తినుబండారాల దుకాణదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

**పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి టి. సునీత.**

**గడువు ముగిసిన, లేబుళ్లు లేని ఆహార పదార్థాల గుర్తింపు.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడులలో పలు దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్లు లేని ఆహార పదార్థాలను గుర్తించారు. ఆయా మిఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణదారులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించాలని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెల మృతి



జగిత్యాల, జూన్ 24 (భారత్ శక్తి): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామ శివారులో విద్యుత్ షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం, కుంట సాయితేజ, ఇన్నారం పోచంకు చెందిన రెండు పాడి గేదెలు గడ్డి మేతకు వెళ్లిన సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. మృతిచెందిన గేదెల విలువ ఒక్కొక్కటి సుమారు రూ.55 వేల వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం (డిపిఓ), నిర్మల్ నుండి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల దర్యాప్తు, విచారణ పురోగతిని ఎస్పీ సమీక్షించారు. కేసులలో ప్రమేయం ఉన్న నిందితులపై చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే, కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసి, అవసరమైన ఆధారాలను సేకరించి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.దర్యాప్తు ప్రక్రియలో ఎటువంటి జాప్యానికి తావు ఇవ్వకుండా, ప్రతి కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, కేసుల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున బిఎల్ఎ లను నియమించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )సుస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. ఫాం 6, 7, 8 ల గురించి వివరించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఎ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ఎప్పటికప్పుడు బిఎల్ఓ లు, బిఎల్ఎ ల తో సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణలో బిఎల్ఎ లు తమ వంతు సహకారం అందించాలని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓలు దేవీదాస్, మోహన్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెట్పల్లి మున్సిపల్ చైర్మన్, జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రిని సన్మానించిన కైలాస్ శ్రీనివాస్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 24: బుధవారం కామారెడ్డి లో మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి ని సన్మానించిన కైలాస్ శ్రీనివాస్ రావ్ మాజీ మున్సిపల్ చైర్మన్, తెలంగాణ ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ శనిశెట్టి గౌరీశంకర్, కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య యూవజన అధ్యక్షులు పెన్సిల్వార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఈ నెల 28 న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి )ఈనెల 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 28వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించాలని చెప్పారు. జూన్ 28వ తేదీ తర్వాత కూడా సిబ్బంది ఇంటింటికి వెళ్లి, చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. అలాగే రానున్న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలి.

**రైతుసంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతి పత్రం అందజేత**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 24 (భారత శక్తి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేసముద్రం తహశీల్దార్ వివేక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు నీరుటి జలంధర్, బొబ్బల యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలక వర్గాలు రైతులకు ఇచ్చిన వాగ్ధానాలను విస్మరించి కార్పొరేట్ బడా వ్యాపారులకు ఊడిగం చేసే విధానాలను వ్యతిరేకిస్తున్నామని, ఖరీఫ్ సీజన్ లో కల్తీ విత్తనాలు, నాసిరకం ఎరువులు పురుగు మందులను నివారించాలన్నారు. బ్యాంకులు సకాలంలో రైతులకు పంట రుణాలను స్కెల్‌ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వాలి. యాసంగి, వానాకాలం రైతు భరోసా ఇవ్వాలి. రైతు డిస్కంలను వెనక్కు తీసుకోవాలని, యూరియా యాప్ రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పోటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని, బ్యాంక్ రుణాలు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని, పోడు రైతులపై అటవీ అధికారుల వేధింపులు ఆపాలని, కౌలు రైతులకు ఋణార్హత కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గోడిశాల వెంకన్న, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలకు పాల్పడిన యాలాల మండలం ఆర్ఐ శివ చరణ్ కుమార్ ని సస్పెండ్ చేయాలి

**ప్రజా సంఘాల డిమాండ్**

**లేనిచో ఆర్డీవో కార్యాలయం ముట్టడిస్తాం**




వికారాబాద్ జూన్ 24 భారత శక్తి వికారాబాద్ జిల్లా తాండూర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యాలాల మండలం ఆర్. ఐ. శివచరణ్ కుమార్ ని సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తాండూర్ ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఏ. ఓ కు వినతిపత్రం ఇచ్చారు . ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలో గత రెండు సంవత్సరాల నుండి అనుమతి లేకుండా ఇసుక తరలించిన ట్రాక్టర్లను పోలీస్ సులు సీజ్ చేసి యాలాల పోలీస్ స్టేషన్లో అన్లోడ్ చేయించడం జరిగింది. దాదాపు 260 ట్రిప్పుల కు సంబంధించిన ఇసుకను డంపు చేయడం జరిగింది.ఇట్టి డంపు చేసిన ఇసుకను వేలంపాట వేయాలంటే ప్రభుత్వ నిబంధనల పరంగా బహిరంగంగా పత్రిక ప్రకటన చేయాల్సి ఉంటుంది కానీ ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఏకపక్షంగా వేలం వేసి కాంట్రాక్టర్ ల తో కుమ్మక్కు అయిన ఆర్ ఐ శివ చరణ్ కుమార్ పై చట్ట పరమయిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాలాల మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్,మరియు కింది స్థాయి అధికారుల ఇన్షియల్,లేకుండానే,నేనే బాస్ అన్నట్టు ఆర్ ఐ శివ చరణ్ కుమార్ వ్యవహారిస్తున్నారని .ఆయన చేసిన నిర్వాకం మూలంగా ప్రభుత్వ ఆర్థికశాఖ కు రావాల్సిన 10 లక్షల రూపాయలు సంబందించిన నిధులకు గండి పడింది అని అన్నారు.ఇప్పటికే అనేక భూ సమస్యలల్లో, అక్రమ ఎర్రమట్టి విషయాలల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్. ఐ చరణ్ కుమార్ పై చట్టపరంగా చర్యలు తీసుకోక పోతే తాండూర్ ఆర్డీవో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షులు చంద్రయ్య, మమ్మద్ సాదిక్, కుర్వ సంఘం నాయకులు, బాలప్ప, డాక్టర్ ముగ్ధం, తిరుపతి, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భోపాల్ ఎఫెక్ట్...

**(భారత శక్తి)**మధ్యప్రదేశ్కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ అనూహ్యంగా తిరస్కరణకు గురికావడం.. ఇప్పుడు జాతీయ రాజకీయాలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపుతోంది. హైదరాబాద్ కోర్టులో ఉన్న ఒక పాత కేసుకు సంబంధించిన సమాచారాన్ని నామినేషన్ అఫిడవిట్‌లో దాచారనే నెపంతో ఆమె ఫామ్‌ను తిరస్కరించడం, దీనిపై సుప్రీంకోర్టు కూడా జోక్యానికి నిరాకరించడం కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద షాక్. అయితే, మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ పొలిటికల్ డ్రామా వెనుక.. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కొందరు కోవర్టుల హస్తం ఉందనే సమాచారం వెలుగులోకి రావడం ఇప్పుడు రాహుల్ గాంధీ ఆగ్రహానికి కారణమైంది.రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకస్తురాలైన మీనాక్షి నటరాజన్‌ను మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ హైకమాండ్ భావించింది. అయితే, ఆమె నామినేషన్‌పై బీజేపీ అభ్యర్థి మహేష్ కేవట్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్ కోర్టులో ఉన్న ఒక ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను అఫిడవిట్‌లో దాచారని రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జూన్ 9న ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. అయితే, అసలు మధ్యప్రదేశ్‌లో ఉన్న బీజేపీ నేతలకు.. తెలంగాణ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఆమె ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా ఉన్న కాలానికి సంబంధించి ఉన్న కేసు వివరాలు, నోటీసుల కాపీలు ఎలా దొరికాయనే దానిపై దర్యాప్తు చేయగా షాకింగ్ విషయాలు బయటపడ్డాయి.ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీజేపీ సీనియర్ మంత్రి కైలాష్ విజయవర్గీయ సైతం కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాల వల్లే తెలంగాణ నుండి సమాచారం లీక్ అయింది అని వ్యాఖ్యానించడం కాంగ్రెస్ అనుమానాలకు బలమిచ్చింది. మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా వచ్చిన తర్వాత పార్టీలోని కొందరు సీనియర్ల ఏకపక్ష నిర్ణయాలకు, గ్రూపు రాజకీయాలకు అడ్డుకట్ట వేశారు. ఈ క్రమంలో ఆమెపై కక్ష పెంచుకున్న తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన ఒక గ్రూపు.. ఆమెను రాజ్యసభకు వెళ్లకుండా దెబ్బతీయడానికి, హైదరాబాద్ కోర్టు డాక్యుమెంట్లను నేరుగా మధ్యప్రదేశ్ బీజేపీ నేతలకు చేరవేసి కోవర్టు రాజకీయం నడిపినట్లు ఏఐసీసీ వర్గాలు గుర్తించాయి.ఈ ద్రోహంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. ఏఐసీసీ తక్షణమే ఒక అంతర్గత విచారణ కమిటీని నియమించింది. సోషల్ మీడియా, అంతర్గత నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఈ కమిటీ ప్రాథమిక విచారణను పూర్తి చేసింది. తెలంగాణకు చెందిన ఒక కీలకమైన ఫస్ట్-టైమ్ ఎమ్మెల్యే ఈ డాక్యుమెంట్ల లీకేజీలో ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు కమిటీ నిర్ధారించినట్లు సమాచారం. పార్టీలో ఉంటూ ప్రత్యర్థి పార్టీకి సమాచారం అందించి, ఏకంగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ నామినేషన్‌నే కొంపముంచిన సదరు ఎమ్మెల్యే వ్యవహారంపై హైకమాండ్ కఠిన చర్యలకు సిద్ధమవుతోంది.మీనాక్షి నటరాజన్ ఇష్యూలో సదరు ఫస్ట్-టైమ్ ఎమ్మెల్యేతో పాటు.. ఆయన వెనుక ఉండి నడిపించిన ఒక సీనియర్ నేతపై కూడా అధిష్ఠానం నజర్ పెట్టింది. ఈ కుట్ర వల్ల కాంగ్రెస్ ఒక విలువైన రాజ్యసభ స్థానాన్ని చేజేతులా కోల్పోవాల్సి వచ్చింది. దీనికి బాధ్యుడిగా తేలిన ఆ ఎమ్మెల్యేను పార్టీ నుండి సస్పెండ్ చేయడమా లేక షోకాజ్ నోటీసులు ఇచ్చి పక్కన పెట్టడమా అనే దానిపై కసరత్తు జరుగుతోంది. కేవలం ఆ ఒక్క ఎమ్మెల్యే మాత్రమే కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో విమర్శలు ఎదుర్కొంటున్న మరికొందరు నేతలను కూడా పదవుల నుండి తొలగించే అవకాశం ఉందని, త్వరలోనే తెలంగాణ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన ఖాయమని పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది.ఇలాంటి కోవర్టు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు శాశ్వతంగా చరమగీతం పాడాలని రాహుల్ గాంధీ గట్టిగా భావిస్తున్నారు. పార్టీ లైన్ దాటిన వారు ఎంతటి వారైనా సరే.. సహించేది లేదనే బలమైన సంకేతాన్ని ఇవ్వడమే రాహుల్ గాంధీ ముఖ్య ఉద్దేశం. తెలంగాణలో పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, అంతర్గత కుమ్ములాటలు జాతీయ స్థాయిలో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆయన అసంతృప్తితో ఉన్నారు. మీనాక్షి నటరాజన్ వంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేతకు జరిగిన ఈ అన్యాయంపై కఠినంగా వ్యవహరించకపోతే క్యాడర్‌లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, అందుకే ఈసారి ప్రక్షాళన సమూలంగా, కఠినంగా ఉండబోతోందని భావిస్తున్నారు.

# బరి తెగిస్తున్న మైనింగ్ మాఫియా

**కరీంనగర్,(భారత శక్తి)** తెలంగాణలో మైనింగ్, రవాణా మాఫియా ఏ స్థాయికి తెగబడిందో అద్దం పట్టేలా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యంత దారుణమైన ఘోరం చోటుచేసుకుంది. జిల్లా రవాణా అధికారి ఎం. వెంకన్న సోమవారం తెల్లవారుజామున చేల్పూర్ పరిసరాల్లో విధి నిర్వహణలో ఉండగా, బొగ్గు లోడ్‌తో వేగంగా దూసుకొచ్చిన ఒక లారీ ఆయనపై నుంచి దూసుకెళ్లింది. ఆర్‌టీఓ ఆఫీస్ సమీపంలో అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్ తనిఖీలు చేస్తున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరగడం, ఘటనా స్థలంలోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం రవాణా శాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందర్నీ షాక్‌కు గురి చేసింది. అయితే, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన ప్రమాదమా? లేక కావాలనే జరిపిన హత్యా అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటన వెనుక బొగ్గు అక్రమ రవాణా మాఫియా హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భూపాలపల్లి ప్రాంతంలో ఓవర్‌లోడింగ్ లారీలపై గత కొంతకాలంగా రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. డీటీఓ వెంకన్న లారీలను ఆపేందుకు ప్రయత్నించినప్పుడు, డ్రైవర్ లారీని ఆపకుండా నేరుగా ఆయనపైకే పోనిచ్చాడని ప్రత్యక్ష సాక్షుల సమాచారం. సాధారణంగా అధికారులు తనిఖీలు చేస్తున్నప్పుడు వాహనాలను నెమ్మదించాల్సింది పోయి, ఏకంగా ఒక జిల్లా స్థాయి అధికారిని తొక్కుకుంటూ వెళ్లడం వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అధికారులను భయభ్రాంతులకు గురిచేసి తమ దందా సాగించుకోవాలనే ప్లాన్‌లో భాగమేనా అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘోర ఉదంతాన్ని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని రవాణా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను ప్రత్యేక విచారణ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# భర్త ఆత్మహత్య కేసులో భార్య సహా ఐదుగురికి జైలు శిక్ష కొత్తగూడెం కోర్టు కీలక తీర్పు

**-భర్త ఆత్మహత్య కేసులో భార్య సహా ఐదుగురికి జైలు శిక్ష కొత్తగూడెం కోర్టు కీలక తీర్పు**

**-మానసిక వేధింపులే ఆత్మహత్యకు కారణమని నిర్ధారణ**




భద్రాద్రి కొత్తగూడెం, భారత శక్తి ప్రతినిధి,జూన్ 24: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య కేసులో భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై నేరం రుజువుకావడంతో కొత్తగూడెం కోర్టు జైలు శిక్షలు విధించింది. ఈ మేరకు కొత్తగూడెం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీమతి కర్నాటి కవిత బుధవారం సంచలన తీర్పును వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, అశ్వరావుపేట మండలం పేరాయిగూడెం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన తోగరం ముత్యాలరావు 2014లో నారాయణపురం గ్రామానికి చెందిన తోగరం శ్యామలను వివాహం చేసుకున్నాడు. ముత్యాలరావు స్థానిక ఫ్యాక్టరీలో రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.అయితే, శ్యామలకు తోగరం కోటేశ్వరరావుతో అక్రమ సంబంధం ఉందని, ఈ విషయాన్ని ముత్యాలరావు పలుమార్లు గుర్తించి వారిని మందలించాడని మృతుడి తల్లి తోగరం తిరుపతమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం శ్యామలను ఆమె తల్లిదండ్రులు తమ ఇంటికి తీసుకెళ్లగా, ఈ వివాదంపై నారాయణపురంలో పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి.ఈ పంచాయతీల సమయంలో ముత్యాలరావును అవమానపరిచే విధంగా దూషించారని, మానసికంగా తీవ్రంగా వేధించారని ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో 2018 జూలై 31న అశ్వరావుపేటలోని ఒక మామిడి తోటలో ముత్యాలరావు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడి వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో తన భార్య శ్యామలతో పాటు ఆమె కుటుంబ సభ్యులు తనను మానసికంగా వేధించారని, బెదిరింపులకు గురిచేశారని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై మృతుడి తల్లి 2018 ఆగస్టు 1న అశ్వరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అప్పటి సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్. మధు ప్రసాద్ దర్యాప్తు చేపట్టి మొత్తం 12 మంది నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కోర్టులో సుదీర్ఘ విచారణ కొనసాగగా, ప్రాసిక్యూషన్ తరఫున 13 మంది సాక్షులను విచారించారు.సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలు, సూసైడ్ నోట్ తదితర ఆధారాలను పరిశీలించిన కోర్టు ఐదుగురిపై నేరం రుజువైందని నిర్ధారించింది. దీంతో తోగరం శ్యామలకు 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, తోగరం వెంకటేశ్వరరావుకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, తోగరం రామారావుకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, తోగరం పుల్లారావుకు 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, తోగరం నరసమ్మకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది.

అదే సమయంలో మిగిలిన నిందితులపై ఆరోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసు నుంచి విముక్తి కల్పించింది. ఈ కేసులో ప్రభుత్వ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు వాదనలు వినిపించగా, నోడల్ ఆఫీసర్ ఎస్సై డి. రాఘవయ్య, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ బి. నాగేశ్వరరావు కేసు నిర్వహణలో కీలక సహకారం అందించారు. ఈ తీర్పు కుటుంబ వివాదాలు, మానసిక వేధింపులు తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయని, ఆత్మహత్యకు ప్రేరేపించే చర్యలను న్యాయస్థానాలు ఎంత తీవ్రంగా పరిగణిస్తాయో మరోసారి స్పష్టం చేసింది.

# విద్యార్థులు మహావృక్షాల్లా ఎదగాలి

- **గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా**
- **విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు**
- **ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలి**
- **లోక్ భవన్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ**





హైదరాబాద్, జూన్ 24: భారత శక్తి, ప్రతి విద్యార్థి ఒక చిన్న మొక్కలాంటివాడని, దానిని ప్రేమతో సంరక్షిస్తే మహావృక్షంగా ఎదిగినట్లే విద్యార్థులను కూడా విద్య, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో తీర్చిదిద్దితే గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తని, తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకొని కుటుంబానికి, గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని గవర్నర్ విద్యార్థులకు సూచించారు.భారత్ సేవాశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం లోక్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, కొద్దిసేపటి క్రితం లోక్ భవన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఒక మొక్కను నాటినట్లు తెలిపారు. ఆ మొక్కకు ప్రతిరోజూ నీరు పోసి, బయటి ప్రతికూల పరిస్థితుల నుంచి రక్షిస్తే అది మహావృక్షంగా మారుతుందని, అదే విధంగా విద్యార్థులను కూడా మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉంచి నాణ్యమైన విద్యతో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.లోక్ భవన్ పాఠశాల కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదని, సమాజంలోని వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లోక్ భవన్ సంకల్పానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.భారత్ సేవాశ్రమ సంఘ్ సేవ, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోందని గవర్నర్ కొనియాడారు. "మానవ సేవయే మాధవ సేవ" అనే సంఘ్ ఆదర్శం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విపత్తు సహాయం, ఆరోగ్య సేవలు, విద్యారంగాల్లో సంఘ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన 'యంగ్ ఇండియా' విద్యార్థి కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. వేలాది మంది విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం, సంకల్పం కనిపించిందన్నారు. అదే వేదికపై విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. లోక్ భవన్ పాఠశాల విద్యార్థులు కూడా తమ శక్తిని విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించాలని సూచించారు. తెలంగాణను దేశంలోనే విద్య, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' వంటి కార్యక్రమాలు ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించేందుకు దోహదపడతాయని అన్నారు.నేడు పంపిణీ చేస్తున్న నోట్‌బుక్‌లు కేవలం కాగితాల కట్టలు కాదని, విద్యార్థుల కలలు, ఆత్మవిశ్వాసం, ఉజ్వల భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వ, లోక్ భవన్ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తూ స్ఫూర్తిదాయక సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న భారత్ సేవాశ్రమ సంఘ్‌ను గవర్నర్ అభినందించారు.

### వైభవ్ సూర్యవంశీని స్ఫూర్తిగా తీసుకోండి

కేవలం 14 ఏళ్ల వయసులోనే ప్రపంచ క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గవర్నర్ సూచించారు. కేవలం 11 బంతుల్లో అర్ధశతకం సాధించడం ద్వారా కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే వయసు అడ్డంకి కాదని నిరూపించాడన్నారు. "పెద్ద కలలు కనండి... వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించండి. విజయం మీ వెంట వస్తుంది" అని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, లక్ష్యసాధనకు వైభవ్ సూర్యవంశీ ప్రయాణం నేటి విద్యార్థులు,యువత కు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణాచారి, భారత్ సేవాశ్రమ సంఘ్ స్వామి మున్నేశ్వరానంద, స్వామి వెంకటేశ్వరానందజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ చిన్నారులతో ముచ్చటించిన గవర్నర్

అంతకుముందు గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, లోక్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు.అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. నోటు పుస్తకాలు అందజేశారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం విద్యార్థుల్లో అవగాహన

**- యాలాల జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాసరచన, కబడ్డీ పోటీలు నిర్వహించిన పోలీసులు**





తాండూరు జూన్ 24 భారత శక్తి డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో భాగంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు యాలాల పోలీసులు బుధవారం యాలాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వ్యాసరచన మరియు కబడ్డీ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విజేతలకు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్సై విఠల్ రెడ్డి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. తమతో పాటు తమ స్నేహితులు, తోటి విద్యార్థులు కూడా డ్రగ్స్ అనే భూతానికి అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు ఆర్థిక, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తారని, మంచి అలవాట్లు అలవరుచుకుని భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్రామేశ్వర్, రవీందర్ రెడ్డి, పీడీ రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏఎస్సై రామచందర్, హెడ్ కానిస్టేబుళ్లు నర్సిములు, జగదీష్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ అనురాధతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

భారత శక్తి
VOICE OF INDIAN
గురువారం, జూన్ 25, 2026

### అయోధ్య రామాలయ కానుకల

# లెక్కింపు ప్రక్రియలో మార్పులు

**లక్నో (భారత శక్తి)**అయోధ్య రామాలయ హుండీ లెక్కింపు విధానం లో అధికారులు పలు మార్పులు చేసారు. విరాళాల చోరీ ఆరోపణలతో నిబంధనలు కఠినతరం చేసారు.లెక్కింపు సిబ్బందికి జేబులు లేని ప్రత్యేక దుస్తులు ధరించాలి. లెక్కింపు హాల్లోకి మొబైల్స్, బ్యాగులు, పర్సులు, వ్యక్తిగత వస్తువులు తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. కౌంటింగ్ రూమ్లో నిఘా కెమెరాల సంఖ్యను పెంచారు.

## ముంబైని వణికించిన కుండపోత వర్షం

**ముంబాయి(భారత శక్తి)** కుండపోత వర్షంతో దేశ ఆర్థిక రాజధాని ముంబాయి వణికింది. ముంబైతో పాటు థానే, పుణెలోనూ భారీ వర్షాలు కురవడంతో జనజీవనం అతలాకుతలం అయింది. ముంబాయి నగరంలో సియాన్ సబ్ వే పూర్తిగా నీట మునిగింది. ముంబైలో సగటున 56 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పలు అండర్బ్రిడ్జిలు నీట మునిగాయి. రైల్వే ట్రాక్లు దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ముంబైకి రెడ్ అలర్ట్ జారీ చేసారు.

## విద్యుత్ షాక్‌తో లైన్ మెన్ మృతి



**జనగామ (భారత శక్తి)**జనగామ మండలం చీటకోడూర్ గ్రామంలో విషాదం నెలకొంది. విద్యుత్ షాక్తో లైన్మన్ రాధమల్ల కరుణాకర్ రెడ్డి మృతి చెందాడు. ట్రాన్స్ఫార్మర్ వద్ద లైన్ తనిఖీ చేస్తుండగా ప్రమాదం జరిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్య పరిశీలనకు లైన్మన్ వెళ్లాడు. స్తంభం ఎక్కిన సమయంలో కరెంట్ షాక్కు గురైయాడు. ప్రమాదవశాత్తు స్తంభం పై నుంచి కిందపడి మృతి చెందాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## గిరిజన యువకుడి ఆత్మహత్య

**పార్వతీపురం మన్యం** గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తవలస గ్రామంలో గిరిజన యువకుడు మృతి చెందాడు. గ్రామానికి సమీపంలో జీడితోటలో కొండగొర్రి శివ చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు శివను కురుపాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కోతుల దాడిలో మహిళకు గాయాలు

**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. విద్యానగర్లో నివాస ప్రాంతాల్లోకి చొరబడిన కోతుల గుంపు బీభత్సాన్ని సృష్టించింది. ఈ కోతుల గుంపు స్థానికుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. తాజాగా మహిళపై ఒక్కసారిగా కోతుల గుంపు దాడి చేసింది. దాడిలో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన మహిళను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. తరచూ కాలనీల్లో సంచరిస్తున్న కోతుల గుంపులతో పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయాందోళనలో ఉన్నారని స్థానికులు అంటున్నారు. కోతుల దాడులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల డిమాండ్. జీహెచ్ఎంసీ, అటవీ శాఖ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేసారు. కోతులను పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేసారు. నివాస ప్రాంతాల్లో భద్రతా చర్యలు పెంచాలని ప్రజలు విజ్ఞప్తి చేసారు. కోతుల బెడదపై అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు శుభవార్త..

**- ఇకపై ఎరువుల బుకింగ్ సులభం**

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువుల పంపిణీలో శుభవార్త అందించింది.

సాంకేతిక సమస్యలను తొలగించి, బుకింగ్ ప్రక్రియను సులభతరం చేశారు. రైతులు తమ సొంత మండలంలోనే యూరియా పొందేలా నిబంధనలు మార్చారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు ఎరువులు చేరేలా యాప్ను మెరుగుపరిచారు.ఎరువుల బ్లాక్ మార్కెటింగ్కు అడ్డుకట్ట వేయడానికి, ప్రతి రైతు తమ మండల పరిధిలోనే ఎరువులు బుక్ చేసుకోవాలని, ప్రతి పంటకు ఎకరానికి గరిష్ఠంగా రెండు బస్తాల యూరియా మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

# రాయదుర్గం భూములపై వెనక్కి తగ్గిన ఎస్ బీఐ

**హైదరాబాద్,(భారత శక్తి)** గత కొన్ని రోజులుగా తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) మధ్య చర్చనీయాంశంగా మారిన రాయదుర్గం భూవివాదం పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇరు వర్గాల మధ్య జరిగిన వరుస చర్చల తర్వాత ఉద్రిక్తతలు తగ్గినట్లు సమాచారం. తాజాగా ఎస్బీఐ తీసుకున్న నిర్ణయాలతో ఈ వ్యవహారం త్వరలోనే ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎస్బీఐ సానుకూలంగా స్పందించింది.

ఈ భూముల వ్యవహారానికి సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ను వెనక్కి తీసుకోవడానికి బ్యాంక్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో వివాదాస్పద భూమికి బదులుగా ప్రభుత్వం సూచించిన 2.5 ఎకరాల ప్రత్యామ్నాయ స్థలాన్ని స్వీకరించేందుకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం.ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) అధికారులు, ఎస్బీఐ ప్రతినిధుల మధ్య మరోసారి సమావేశం జరగనుంది. ఈ భేటీలో మిగిలిన అంశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. చర్చలు సానుకూలంగా ముగిస్తే భూ వివాదానికి పూర్తిస్థాయిలో తెరపడే అవకాశం ఉంది.

ఇక ఈ వివాదం కారణంగా ఎస్బీఐపై తెలంగాణ ప్రభుత్వం గతంలో కఠిన వైఖరి అవలంబించింది. ప్రభుత్వ శాఖలకు చెందిన పలు లావాదేవీల విషయంలో పరిమితులు విధిస్తూ అంతర్గతంగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ, ఆర్థిక వర్గాల్లో కూడా చర్చకు దారితీసింది.అయితే ఇప్పుడు పరిస్థితి మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎస్బీఐ వైఖరిలో మార్పు రావడంతో ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. బ్యాంక్తో కొనసాగుతున్న ప్రభుత్వ లావాదేవీలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఫిక్స్డ్ డిపాజిట్లు, ప్రభుత్వ గ్రాంట్ల నిర్వహణతో పాటు ఎస్బీఐకి ఉన్న లీడ్ బ్యాంక్ హోదాను కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. హైకోర్టులో తదుపరి విచారణ పూర్తయిన తర్వాత ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అప్పటివరకు ఇరు పక్షాలు చర్చల ప్రక్రియను కొనసాగించే అవకాశముంది.

## కస్టోడియల్ టార్చర్ వల్లే సాయికృష్ణ మృతి

**విజయవాడ (భారత శక్తి)** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కస్టడీకి తీసుకున్న సాయికృష్ణను పోలీసులు కొట్టడంతో థర్డ్ డిగ్రీ దెబ్బల వల్లే అతడు చనిపోయాడని సిట్ నిర్ధారించింది. ఈ మేరకు బుధవారం విజయవాడ 2వ ఏసీజేఎం కోర్టు (రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు)కు సిట్ రిమాండ్ రిపోర్ట్ సబ్మిట్ చేసింది. సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ వల్లే చనిపోయాడని సిట్ స్పష్టం చేసింది. మే 1 నుంచి జూన్ వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలు మాయం చేశారని సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. వాదనల అనంతరం కోర్టు సీఐ నాగరాజుకు 14 రోజులపాటు (జులై 8) వరకు రిమాండ్ విధించింది. పోలీసులు నిందితుడు నాగరాజును నెల్లూరు జిల్లా జైలుకు తరలించనున్నారు.సాయికృష్ణ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన సిట్ అధికారులు మొత్తం 17 మందిని విచారించినట్లు తెలిపారు. మే 6న సీఐ నాగరాజు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నప్పటికీ కోర్టులో హాజరుపరచలేదని, కస్టోడియల్ టార్చర్ వల్లే చనిపోయాడని కోర్టుకు సిట్ తెలిపింది. విచారణలో సీఐ నాగరాజు తమకు సహకరించలేదని, కేసుకే సంబంధించిన విషయాలు అడిగినా సరిగ్గా స్పందించలేదని తెలిపారు. నాగరాజును కస్టడీకి ఇవ్వాలని సిట్ కోరింది. రెండు వారాల రిమాండ్ విధించింది.బాధితురాలి విజ్ఞప్తి మేరకు మే 18న కోర్టు కృష్ణలంక పీఎస్ లోని సీసీటీవీ రికార్డులను (ఆఎఖీ) భద్రపరచాలని ఆదేశించింది. జూన్ 19న మంగళగిరి ఏపీ ఫోరెన్సిక్ లాబొరేటరీ (ఒఖఈఊఒ) సైంటిఫిక్ అసిస్టెంట్ బృందం స్టేషన్ను పరిశీలించగా, మే 1 నుండి జూన్ 1 వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజ్ డేటా మొత్తాన్ని డిలీట్ చేసినట్లు గుర్తించారు. నిందితుడు తన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి డిజిటల్ ఆధారాలను పూర్తిగా ధ్వంసం చేశాడని స్పష్టమైంది.అంతేకాకుండా, మే 6 నుండి జూన్ 2 లోపే (హైకోర్టులో పిటిషన్ వేయకముందే) థర్డ్ డిగ్రీ దెబ్బలు తాళలేక సాయికృష్ణ లాకప్‌లోనే మరణించాడు. అనంతరం సీఐ నాగరాజు ఆ శవాన్ని ఎవరికీ తెలియకుండా రహస్య ప్రాంతానికి తరలించి, తగలబెట్టి సాక్ష్యాలు లేకుండా చేశాడని సిట్ ప్రాథమిక విచారణలో నిర్ధారించింది.జూన్ 19న రాత్రి 2 గంటలకు కృష్ణలంక పీఎస్‌లో క్రైమ్ నెం. 107/2026 కింద బీఎన్ఎస్‌సెక్షన్లు 127(4), 127(6) (అక్రమ నిర్బంధం), 103(1) (హత్య), 238 (సాక్ష్యాల నాశనం, తప్పుడు సమాచారం ఇవ్వడం) కింద కేసు నమోదైంది. సాయికృష్ణను మే 6 నుండి మే 8 మధ్య లాకప్‌లో చూసినట్లు ఆ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇతర మహిళా కానిస్టేబుళ్లు కూడా సిట్ విచారణలో వాంగ్మూలం ఇచ్చారు. అరెస్ట్ అయిన సీఐ నాగరాజు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, శవాన్ని ఎక్కడ తగలబెట్టారు? ఎక్కడ పూడ్చారు? ఈ నేరంలో ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే విషయాలపై సమాధానాలు దాటవేశాడని కోర్టుకు సిట్ తెలిపింది. నిందితుడు అదే పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేయడం వల్ల, బయట ఉంటే సాక్షులను, ముఖ్యంగా తన కింద పనిచేసిన సిబ్బందిని బెదిరించే ప్రమాదం ఉందని కోర్టుకు వివరించారు.జూన్ 24న విజయవాడ సీఐ నాగరాజుకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ లాకప్ డెత్ వెనుక ఉన్న పూర్తి నిజాలు రాబట్టేందుకు, మృతదేహాన్ని వెలికితీసేందుకు నిందితుడిని 15 రోజుల పాటు జుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని, అలాగే పోలీస్ కస్టడీకి అనుమతించాలని దర్యాప్తు అధికారి కోర్టును కోరారు.

# ఏపీలో సువర్ణ అధ్యాయం

**కర్నూలు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త సువర్ణ అధ్యాయం మొదలైందని, రాయలసీమ ప్రాంతం త్వరలోనే రతనాలసీమ గా మారబోతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రంగ స్వర్ణగిరి గోల్డ్ మైన్స్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆయన బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. గతంలో జొన్నగిరిని స్వర్ణగిరి గా పిలిచేవారని, ఇప్పుడు ఇక్కడ వాణిజ్యపరంగా బంగారం ఉత్పత్తి కాబోతుండటం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. భవిష్యత్తులో దేశమంతా ఈ ప్రాంతం గురించే మాట్లాడుకుంటుందని, జొన్నగిరి బంగారం ఇక్కడి ప్రజల జీవితాలను మార్చేస్తుందని స్పష్టం చేశారుదేశంలో చమురు తర్వాత అత్యధికంగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేసి దిగుమతి చేసుకునేది బంగారమేనని చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకప్పుడు దేశంలో కేజీఎఫ్ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ ఎలాగో.. ఇప్పుడు 'జేజీఎఫ్' జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అలా మారబోతోందని ఆయన అభివర్ణించారు. రాయలసీమలో సిరులు పండించేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ మైనింగ్ ప్రాజెక్ట్ ద్వారా ప్రస్తుతం ఏడాదికి 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి ప్రారంభం కానుందని, భవిష్యత్తులో దీనిని 1000 కిలోలకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే త్వరలో ప్రారంభించబోయే రెండో యూనిట్‌తో కలిపి మొత్తం 50 టన్నుల బంగారు నిల్వలను వెలికితీసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ బంగారు గనుల ప్రాజెక్ట్ కేవలం నిధులకే కాకుండా స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పనకు సరికొత్త మార్గాలను తెరిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ గోల్డ్ మైన్స్ ప్లాంట్‌లో ఇప్పటికే 800 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయని, త్వరలోనే మరో 1500 మందికి పైగా ప్రత్యక్షంగా ఉపాధి దొరకనుందని చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ స్వర్ణగిరి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో విస్తరించిన తర్వాత ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి పైగా స్థానికులకు జీవనోపాధి లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. దీని ద్వారా రాయలసీమ యువతకు వలసలు పోయే అవసరం లేకుండా సొంత ఊరిలోనే మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఇదే వేదికపై నుంచి ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. అబద్ధాలు చెప్పడంలో ఆ పార్టీ నాయకుడు ప్రపంచంలోనే దిట్ట అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్, గొడ్డలి సంస్కృతిని పెంచి పోషించిన ఆ 'గొడ్డలి పార్టీ' నాయకులు.. ఇటీవల జరిగిన సాయికృష్ణ ఘటనపై కూడా నీచమైన కుల రాజకీయం చేస్తూ లబ్ధి పొందాలని చూశారని మండిపడ్డారు. ఆ కేసులో నిందితుడైన సీఐ కాపు కులస్థుడే, బాధితుడు కూడా కాపు కులస్థుడే అయినప్పటికీ.. దానికి రాజకీయ రంగు పులిమి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రప్పా రప్పా రాజకీయం తప్ప ఆ గొడ్డలి పార్టీ రాష్ట్రానికి చేసిందేమీ లేదు. మళ్లీ వచ్చి గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు.. ఖబడ్దార్ జాగ్రత్త!" అని చంద్రబాబు హెచ్చరించారు.తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిని కల్తీ చేసి మహా పాపానికి ఒడిగట్టిన గొడ్డలి పార్టీ నాయకుడు, ఇప్పుడు తప్పులు కప్పిపుచ్చుకోవడానికి దొంగ నాటకాలు ఆడుతూ దేవాలయాల చుట్టూ తిరుగుతున్నాడని చంద్రబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాత్రింబవళ్లు కుట్రలు పన్నుతూ.. రాష్ట్రాన్ని కులం, మతం, ప్రాంతం , వర్గాల వారీగా విడదీయాలని నిత్యం విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఫేక్ ప్రచారాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని, అనాలోచితంగా నోరు పారేసుకుంటే చట్టబద్ధంగా వారి నోళ్లు మూయించే పూర్తి శక్తి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ఉందని చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు

### డీఎస్సీ2003 ఉద్యోగులకు

## ఓపీఎస్ అమలు చారిత్రాత్మక నిర్ణయం

**- ప్రభుత్వం పాత పెన్షన్ వర్తింపు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం**

**- కొండూరు శ్రీనివాసరాజు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు**



**బద్వేలు(భారత శక్తి)** 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 10,715 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ాఖూ) వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు.బుధవారం రాయచోటి సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం వేలాది ఉద్యోగుల కుటుంబాలకు భవిష్యత్ భరోసాను కల్పిస్తుందని అన్నారు.అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేస్తున్న దాదాపు 15 వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలను మరింత కాలం ప్రజలకు అందించే అవకాశం లభిస్తుందన్నారు.ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యా మరియు ఐటీ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (ఊాఓ), మంత్రివర్గ సభ్యులు, అలాగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు శ్రీ వేపాడ చిరంజీవి రావు, శ్రీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శ్రీ కంచర్ల శ్రీకాంత్, శ్రీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శ్రీ పేరాబత్తుల రాజశేఖర్‌ల నిరంతర కృషి, చొరవ మరియు పోరాట ఫలితంగానే ఈ నిర్ణయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నల్లమల రామాంజులు, రాయచోటి మండల అధ్యక్షుడు నాగరాజు, సంఘ బాధ్యులు మడితాటి నరసింహారెడ్డి, తిరుపతి శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్, వైసీ రెడ్డప్ప రెడ్డి, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు...

# వివాదంలో ఎంపీ సీఎం

**భోపాల్, (భారత శక్తి)**మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ఒక భారీ భూ కుంభకోణం వ్యవహారం ఒక్కసారిగా దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబ సభ్యులు ఉజ్జయిని నగర పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసిన తీరు తీవ్రమైన వివాదానికి దారితీసింది. సీఎం పదవి చేపట్టిన నాటి నుంచి ఆయన భార్య, కుమారుడు, కోడలు, సోదరులు, కజిన్స్ అందరూ కలిసి వందల కోట్లు పలికే ప్రైమ్ ల్యాండ్స్‌ను తమ ఖాతాలో వేసుకున్నట్లు వెల్లడవడంతో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ దీనిని మహాకాల్ భూముల దోపిడీ గా అభివర్ణిస్తూ సీఎం రాజీనామాకు డిమాండ్ చేస్తోంది.2023 డిసెంబర్‌లో మోహన్ యాదవ్ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి గడిచిన రెండేళ్ల కాలంలో ఆయన భార్య సీమా యాదవ్, కుమారుడు వైభవ్ యాదవ్, కోడలు శాలిని యాదవ్, సోదరులు నందలాల్, నారాయణ్ యాదవ్ , కజిన్స్ కలిసి ఉజ్జయిని ప్రాంతంలో దాదాపు 137 ప్లాట్లలో విస్తరించి ఉన్న 168 ఎకరాల భూమిని కేవలం 45 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసినట్లు భూమి యాజమాన్య రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ లావాదేవీలు కొన్ని నేరుగా వారి పేర్ల మీద, మరికొన్ని వారి కుటుంబానికి చెందిన నాలుగు రియల్ ఎస్టేట్ కంపెనీల ద్వారా జరిగాయి. ఈ భూముల కొనుగోలు జరిగిన కొద్ది కాలానికే.. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఉజ్జయిని నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ఉజ్జయిని మాస్టర్ ప్లాన్ 2035 ను అధికారికంగా ప్రకటించింది. చిత్రం ఏమిటంటే, ఈ మాస్టర్ ప్లాన్ కింద ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త జాతీయ రహదారులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, బైపాస్ రోడ్లు , సింహస్థ కుంభమేళా మౌలిక వసతుల ప్రాజెక్టులన్నీ సరిగ్గా సీఎం కుటుంబం కొనుగోలు చేసిన 111 ఎకరాల భూముల పరిసర ప్రాంతాల గుండానే వెళ్తున్నాయి. అంతకంటే షాకింగ్ విషయం ఏమిటంటే.. వీరు కొనుగోలు చేసిన వ్యవసాయ భూములన్నీ ఈ మాస్టర్ ప్లాన్ రాకతో రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లుగా మారిపోయాయి.ప్రభుత్వ ప్రాజెక్టుల ప్రకటనకు ముందే ఇన్‌సైడర్ సమాచారంతో ఈ భూములు కొన్నారనే ఆరోపణలకు బలం చేకూరుస్తూ.. మాస్టర్ ప్లాన్ విడుదలైన వెంటనే ఆయా ప్రాంతాల్లోని ల్యాండ్స్ వాల్యూ రాత్రికి రాత్రే రాకెట్ వేగంతో పెరిగిపోయింది. 45 కోట్లకు కొన్న భూముల విలువ ఇప్పుడు వందల కోట్లకు చేరింది. ఈ వ్యూహాత్మక ల్యాండ్ బ్యాంక్‌ను ఉపయోగించుకుని సీఎం కజిన్స్ అప్పుడే కొన్ని ప్రైవేట్ బిల్డర్లతో హౌసింగ్ ప్రాజెక్టుల కోసం డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు కూడా కుదుర్చుకున్నట్లు ఆధారాలు లభించాయి. దీంతో ముఖ్యమంత్రి తన అధికారిక పరపతిని వాడుకుని ముందే ప్లాన్ చేసి తన కుటుంబానికి లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ వివాదంపై ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా స్పందించనప్పటికీ, సీఎం కుటుంబ సభ్యులు , అధికారులు మాత్రం ఈ ఆరోపణలను ఖండించారు. తమ కుటుంబం 2010 నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉందని, తాము ప్రైవేట్ వ్యక్తులుగా సాధారణ వ్యాపార పద్ధతుల్లోనే భూములు కొన్నామని సీఎం మేనల్లుడు అనంత్ యాదవ్ వాదించారు. అయితే కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ .. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వంలో లూటీ ఇంజన్ నడుస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో 100 ఎకరాలు ఉన్న ఈ ఫ్యామిలీ ఆస్తులు సీఎం అయ్యాక ఏడాదిన్నరలోనే 335 ఎకరాలకు ఎలా పెరిగాయో సమాధానం చెప్పాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో జుడీషియల్ విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.

## భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**ముంబై (భారత శక్తి)** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో మార్కెట్లు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 790.54 పాయింట్లు లాభపడి 76,991.22 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 197.55 పాయింట్లు పెరిగి 24,021.65 వద్ద ముగిసింది.ట్రేడింగ్ సెషన్ ఆరంభం నుంచే మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ కనిపించింది. కీలక రంగాల్లో ఇన్వెస్టర్లు షేర్లను కొనుగోలు చేయడంతో సూచీలు మంచి లాభాలను నమోదు చేశాయి. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ట్రెంట్ షేర్లు అత్యధికంగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి.రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ రియల్టీ సూచీలు 2 శాతానికి పైగా లాభపడి మార్కెట్ ర్యాలీని నడిపించాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. అయితే, నిఫ్టీ ఆటో, నిఫ్టీ మెటల్ సూచీలు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ కారణంగా ఈ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.10 శాతం, స్మాల్‌క్యాప్ 0.39 శాతం స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి.టెక్నికల్ నిపుణుల ప్రకారం, నిఫ్టీకి 24,100 స్థాయి వద్ద తక్షణ ప్రతిఘటన ఎదురవుతోంది. దీనిని అధిగమిస్తే బుల్లిష్ ట్రెండ్ కొనసాగి 24,200, ఆపై 24,400 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. మరోవైపు, 24,000 మార్క్ తక్షణ మద్దతుగా, 23,900-23,800 జోన్ కీలక సపోర్ట్‌గా పనిచేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కొత్త ఉద్యోగులతో సీఎం విజయ్..

**- ఫ్యామిలీకి హాయ్, హార్ట్ సింబల్!**

**చెన్నై (భారత శక్తి)**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఒక అధికారిక కార్యక్రమాన్ని తనదైన శైలిలో ఎంతో ఉత్సాహంగా, చిరస్మరణీయంగా మార్చారు. బుధవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో 'ట్యాంజెడ్‌కో' (విద్యుత్ బోర్డు)కు కొత్తగా ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు కోరిన సరదా విన్నపాలను ఆయన మన్నించి అక్కడి వారందరినీ ఆకట్టుకున్నారు.తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రాష్ట్ర విద్యుత్ శాఖకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి విజయ్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఒక నూతన ఉద్యోగి తన కుటుంబ సభ్యులకు 'హాయ్' చెప్పాలని కోరగా, విజయ్ చిరునవ్వుతూ కెమెరా వైపు చూసి అభివాదం చేశారు.మరొక అభ్యర్థి 'హార్ట్ సింబల్' చూపించమని కోరగా, ఆయన ఆ విన్నపాన్ని కూడా తీర్చారు. దీంతో సభ ప్రాంగణమంతా చప్పట్లు, కేరింతలతో సందడిగా మారింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ విజయం సాధించిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించారు.

## ఆళ్లగడ్డలో ఆర్టిసి కార్మికులు ఆందోళన




**ఆళ్లగడ్డ (భారత శక్తి)**ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థకు అప్పజెప్పాలని కోరుతూ బుధవారం రెండవ రోజు ఆళ్లగడ్డలో డిపో కార్యాలయం ఆవరణంనందు కార్మిక సంఘ,ఏంఅ నాయకులు, ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరావు జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ విద్యుత్ బస్సులు ఆర్టీసీ సంస్థలో ప్రవేశపెట్టడం వలన ప్రైవేటు పరం వైపు వెళ్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన విరమించుకోవాలని జేఏసీ నాయకులు కోరారు.

## ముక్కంటి సేవలో సినీ నటి హన్సిక



**శ్రీకాళహస్తి(భారత శక్తి)** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమా నిత్య రాహు కేతు దోష నివారణ పూజలను సినీ నటి హన్సిక కుటుంబ సభ్యులతో కలసి ఆలయం కు విచ్చేశారు. బుధవారం సహస్ర లింగం వద్ద 5 వేల రూపాయల ప్రత్యేక రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ బోర్డు సభ్యులు స్వాగతం పలికారు తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్ధ ప్రసాదాలు ఆలయ బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి అందజేశారు

# రజనీకాంత్ కొత్త చిత్రం 'ధర్మన్'.. టైటిల్ ప్రకటించిన కమల్ హాసన్

సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ కలయికలో వస్తున్న సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటివరకు 'తలైవా 173'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'ధర్మన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఆపరేషన్ థియేటర్‌లో రజనీకాంత్, చేతిలో సర్జికల్ బ్లేడ్‌తో నిల్చొని ఉండగా... ఆయన కాలు కింద ఒక రౌడీ పడి ఉన్నట్టుగా ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీంతో ఈ సినిమాలో రజనీ డాక్టర్‌గా కనిపించబోతున్నారనే ప్రచారానికి బలం చేకూరింది. టైటిల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ కమల్ హాసన్ 'ధర్మమే వెల్లుమ్!' (ధర్మమే గెలుస్తుంది) అని ట్వీట్ చేశారు. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్‌కు మొదట దర్శకుడిగా సుందర్ సిని ప్రకటించారు. కానీ, ఆయన తప్పుకోవడంతో ఆ తర్వాత సిబి చక్రవర్తి పేరు తెరపైకి వచ్చింది. అయితే, అనూహ్యంగా ఆయన కూడా ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. ఈ క్రమంలో 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మరిముత్తు దర్శకత్వం వహిస్తారని ప్రచారం జరిగింది. తాజాగా ఆ వార్తలను నిజం చేస్తూ, అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలోనే ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీతలు అనిబరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.









## ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!

హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల క్రీ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది. కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది. ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల క్రీ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.



## సినీ ఇండస్ట్రీ మహిళలకు సేఫ్ కాదు

### 18 ఏళ్లకే చేదు అనుభవం.. సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు

సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్, మహిళల భద్రత వంటి అంశాలు ఎప్పటికప్పుడు చర్చనీయాంశంగా మారుతూనే ఉంటాయి. పలువురు నటీమణులు, గాయకులు, సాంకేతిక నిపుణులు గతంలో ఈ అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. తాజాగా ప్రముఖ సింగర్ సునీత చేసిన వ్యాఖ్యలు మరోసారి ఇండస్ట్రీలో మహిళల భద్రతపై చర్చకు దారితీశాయి. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సునీత, సినీ పరిశ్రమ మహిళలకు పూర్తిగా సురక్షితమైన ప్రదేశం కాదని స్పష్టం చేశారు. తాను ఇండస్ట్రీలో విజయవంతమైన మహిళ అయినప్పటికీ ఈ విషయాన్ని నిజాయితీగా చెబుతున్నానని పేర్కొన్నారు. సినీ ఇండస్ట్రీ మహిళలకు కచ్చితంగా సేఫ్ కాదు. నేను ఈ పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ వుమెన్ అయినా కూడా ఇదే చెబుతున్నాను. బయటకు వచ్చి నాకు ఇలా జరిగింది, అలా జరిగింది అని చెప్పడం నాకు పెద్దగా ఇష్టం ఉండదు. ఎందుకంటే ఇది ఒక్కరి సమస్య కాదు. చాలా మంది ఎదుర్కొనే పరిస్థితి అని అన్నారు. ఇండస్ట్రీలో కొన్ని సందర్భాల్లో దోపిడీ, అసభ్య ప్రవర్తన వంటి సమస్యలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. తనకు కేవలం 18 ఏళ్ల వయసులోనే ఇలాంటి అసౌకర్యకర పరిస్థితి ఎదురైందని సునీత వెల్లడించారు. అయితే ఆ ఘటన గురించి మరిన్ని వివరాలు చెప్పడానికి ఆమె ఆసక్తి చూపలేదు. ఆ విషయాలను పదే పదే చర్చించడం నాకు ఇష్టం ఉండదు. అలాంటి చర్చలకు ముగింపు ఉండదు అని ఆమె అన్నారు. ఇండస్ట్రీలో కొంతమంది ఒకరి వద్ద చాలా గౌరవంగా ప్రవర్తిస్తే, మరొకరి వద్ద పూర్తిగా భిన్నంగా ప్రవర్తించే పరిస్థితులు ఉంటాయని సునీత వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి ఒకరి దగ్గర పెద్దమనిషిలా ప్రవర్తించవచ్చు. అదే వ్యక్తి మరొకరి వద్ద వేరేలా ప్రవర్తించవచ్చు అంటూ ఆమె పేర్కొన్నారు. మహిళల స్వేచ్ఛ, ఫెమినిజం గురించి కూడా సునీత తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "మై బాడీ.. మై రైట్ అని మహిళలు చెబితే, హిస్ ఐస్.. హిస్ రైట్ అని మరో కోణం కూడా వస్తుంది. ఫెమినిజం అంటే ఏమిటి అనే అంశంపై కూడా చాలా చర్చ అవసరం అని అన్నారు. అలాగే పురుషులు, మహిళలు పూర్తిగా ఒకేలా ఉండరని, సమాజంలో కొన్ని అంశాలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. సునీత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాలకు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు ఆమె వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## అసలు నిజమేమిటో?



నటి త్రిష మరోమారు వార్తల్లో నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. తన సహచర నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో ఆమె రిలేషన్‌పై గత కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో వార్తలు వస్తూనే ఉన్నాయి. వాటికి తగ్గట్టుగానే త్రిష ప్రవర్తన కూడా ఉండేది. అయితే.. తాజాగా త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ని అన్‌ఫాలో చేసిందంటూ ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు విజయ్‌ని త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవ్వడంలేదని, అసలు ఫాలో అయితే కదా అన్‌ఫాలో చేసేది? అంటూ మరికొందరు నెటిజన్లు పైవార్తను ఖండిస్తూ కౌంటర్ పోస్టులు పెడుతున్నారు. ఇదిలావుంటే.. ఈ నెల 22న విజయ్ పుట్టినరోజు జరుపుకున్నారు. తమిళనాట సినీ, రాజకీయ ప్రముఖులంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు క్యూ కట్టారు. సోషల్ మీడియా వేదికగా విషెస్ తెలిపారు. కానీ త్రిష మాత్రం ఈసారి మౌనంగా ఉన్నది. ప్రతి ఏడాది విజయ్ పుట్టిన రోజున తప్పకుండా శుభాకాంక్షలు తెలిపే త్రిష ఈ ఏడాది మౌనంగా ఉండటం, ఇన్‌స్టాలో ప్రతి పుట్టిన రోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను పంచుకునే త్రిష ఈసారి అలాంటి ప్రయత్నాలు చేయకపోవడం.. ఈ కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారనే ప్రచారం తమిళనాట వినిపిస్తున్నది. ఈ ప్రచారాన్ని ఖండిస్తూ కొందరు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు నిగ్గు తేలాలంటే, త్రిషనే ఈ విషయంపై స్పందించాలి.

## కృష్ణాలయం చుట్టూ తిరిగే కథ



మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించిన చిత్రం 'వసుదేవసుతం'. వైకుంఠ్ బోను దర్శకుడు. ధనలక్ష్మి బాదర్ల నిర్మాత. జూలై 10న సినిమా విడుదల కానున్నది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఒరిస్సాలోని వాసుదేవుని ఆలయం చుట్టూ తిరిగే కథ ఇదని ట్రైలర్ చూస్తే తెలుస్తున్నది. ఆలయంలోని బ్రహ్మపదార్థం కోసం శత్రుమూకలు చేసే ప్రయత్నాలను అడ్డుకునే పాత్రలో హీరో మహేంద్రన్ కనిపించారు. 'ఆయుధం వస్తోంది.. దేవుడి అస్తిత్వాన్ని ప్రశ్నించే ఎవ్వడికీ ఈ భూమ్మీద బతికే హక్కు లేదు' అనే డైలాగ్.. ట్రైలర్ చివర్లో గరుత్మంతుడి షాట్ సినిమాపై ఆసక్తిని పెంచింది. అద్భుతమైన కంటెంట్‌తో వస్తున్న సినిమా ఇదని, ఇలాంటి సినిమాలో నటించడం నిజంగా తన అదృష్టమని హీరో మహేంద్రన్ అన్నారు. ఒరిస్సాలోని ప్రముఖ ఆలయం నేపథ్యంలో ఈ కథ రాసుకున్నట్టు దర్శకుడు వైకుంఠ్ బోను తెలిపారు. కథే ఈ చిత్రానికి ప్రాణమని, మణిశర్మ నేపథ్య సంగీతం, పాటలు సినిమాను మరో స్థాయిలో నిలబెట్టాయని ఆయన తెలిపారు.

## చరణ్‌లో పరిపూర్ణమైన నటుడ్ని చూశా




"'పెద్ది' సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇది అరుదైన సినిమా. చూసినంతసేపూ భావోద్వేగానికి లోనయ్యాను. ఆ పాత్రలు అనుభవించిన బాధని నేనూ అనుభవించాను. ఇది మట్టి కథ, మట్టి మనిషి కథ. ఆ జీవన విధానాలపై అవగాహన ఉన్నవాడు కాబట్టే బుచ్చిబాబు ఈ కథను అంతబాగా రక్తికట్టించగలిగాడు. పాత్రగా మారిపోయి అన్ని భావోద్వేగాలను తెరపై పలికించడం సామాన్యమైన విషయం కాదు. ఈ విషయంలో రామ్‌చరణ్‌ని చూసి తండ్రిగా గర్విస్తున్నా. తెరపై చరణ్ కనిపించలేదు. పెద్ది మాత్రమే కనిపించాడు. ఒక సంకల్పంతో, కఠోర శ్రమతో ముందుకెళ్లాడు కనుకే, తనకీ విజయం. తనలో పరిపూర్ణమైన నటుడ్ని చూశాను. అంతా నేషనల్ అవార్డు విన్నింగ్ పెర్ఫార్మెన్స్ అంటున్నారు. వస్తే ఆనందం. రాకపోయినా పర్లేదు. ప్రజల మెప్పుకు మించిన అవార్డు లేదు. 'గూండా' సినిమా టైమ్‌లో నా కష్టాన్ని చూసి మా నాన్న అనుభవించిన సంఘర్షణను 'పెద్ది' టైమ్‌లో నేనూ అనుభవించాను. 'పెద్ది'గా చరణ్ నటన చూసి పుత్రోత్సాహం పొందుతున్నాను' అని అతిథిగా విచ్చేసిన అగ్ర హీరో చిరంజీవి ఆనందం వెలిబుచ్చారు. రామ్‌చరణ్ హీరోగా రూపొందిన పానిండియా యాక్షన్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకటసతీశ్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ మీట్‌లో చిరంజీవి మాట్లాడారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'నాకెంతో సంతృప్తినిచ్చిన విజయం ఇది. ఇంతటి గొప్ప అనుభూతి నాకెప్పుడూ కలగలేదు. రామ్‌చరణ్‌ని మర్చిపోయి అంతా 'పెద్ది'నే గుర్తు పెట్టుకుంటారేమో అని భయమేస్తుంది. చివరికి మా అమ్మాయి క్లింకార కూడా నన్ను 'పెద్ది' అనే పిలుస్తున్నది. ఇంతటి అపూర్వమైన జ్ఞాపకాన్ని ఇచ్చిన బుచ్చిబాబుకి, మా టీమ్ మొత్తానికీ కృతజ్ఞతలు' అని తెలిపారు. ఇంకా అగ్ర దర్శకులు, సుకుమార్, అనిల్ రావిపూడితో పాటు చిత్రబృందమంతా పాల్గొన్నారు.

## నా గురించి నీకు తెలియాలి

విశ్వ, ఐశ్వర్య జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'నా గురించి నీకు తెలియాలి' ఇటీవల ప్రారంభమైంది. వెంకటేష్ కలివెల దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని సంజన కలివెల నిర్మిస్తున్నారు. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుందని, నేటి ట్రెండ్‌కు తగినట్లుగా రూపొందించబోతున్నామని దర్శకుడు తెలిపారు. ఈ నెలాఖరు నుంచి కోనసీమలోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుతామని, సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ధర్మేంద్ర దివి, సంగీతం: వర్ధన్, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకటేష్ కలివెల.



## ఉద్యోగుల పట్ల సీఎం చంద్రబాబు

# నాయుడు మానవతా దృక్పథం

**- మెమో-57 చారిత్రాత్మక నిర్ణయం.. - హర్షం వ్యక్తం చేసిన చీర్ల కిరణ్**

**- అర్హులైన టీటీడీ ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ అమలు చేయాలి..**

**తిరుపతి (భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చీర్ల కిరణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం.57 ద్వారా అర్హులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఒపీస్ ) వర్తింపజేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న మానవతా దృక్పథానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ అమలుకు ముందు నియామక ప్రక్రియ పూర్తయి, పరిపాలనా కారణాల వల్ల ఆలస్యంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ)లో కూడా మేనేజ్‌మెంట్ పరమైన ఆలస్యాల కారణంగా 2004లో ఉద్యోగాలు పొందాల్సిన అనేక మంది అభ్యర్థులకు 2005లో నియామకాలు లభించాయని, దీంతో వారు పాత పెన్షన్ విధానానికి అర్హులైనా కొత్త పెన్షన్ విధానం (సిపిస్ ) పరిధిలోకి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. మెమో-57 స్ఫూర్తిని కొనసాగిస్తూ, టీటీడీలో మేనేజ్‌మెంట్ ఆలస్యం వల్ల అన్యాయానికి గురైన అర్హులైన ఉద్యోగుల పరిస్థితిని కూడా ప్రభుత్వం మరియు టీటీడీ సానుకూలంగా పరిశీలించి, వారికి సైతం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చీర్ల కిరణ్ కోరారు. రాష్ట్రంలో ఇంకా సిపిస్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం దశలవారీగా పరిష్కరించి, ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు మరిన్ని చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## మంగళంలో మహిళలకు

# ఉచిత మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం

**- చేతివృత్తులతోనే ఆర్థికాభివృద్ధి..- మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ' - రాస్' డైరెక్టర్ వి. నాగరాజు..**




**రేణిగుంట(భారత శక్తి)** రాస్ జన శిక్షణ సంస్థాన్,తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం మంగళం నందు మహిళలకు మగ్గం వర్క్ (ఆర్య వర్క్) పై మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ డైరెక్టర్ వి.నాగరాజు మరియు జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ బి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతి వృత్తులు నేర్చుకుని అభివృద్ధి చెందాలని తెలియజేశారు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ ముందుకు సాగాలని తెలిపారు. అంతే కాకుండా జన శిక్షణ సంస్థాన్ నిర్వహించే వివిధ రకాల చేతి వృత్తుల పై శిక్షణ తీసుకోవాలని కోరారు. తరువాత బి . సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చేతివృత్తులతోపాటు ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని.అలాగే రాస్ నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్య వర్క్ నేర్చుకోవడానికి వచ్చినటువంటి మహిళలందరికీ ఉచి తంగా ముడి సరుకుని అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ ఫీల్డ్ ఆఫీసర్ డి . నాగరాజు ,శ్రీదేవి ,క్లస్టర్‌లీడర్లువెంకటలక్ష్మి,నేర్పించేటీచర్‌పి.లావణ్య, 40 మంది మహిళలు పాల్గొన్నారు.

# హిజ్రాల వేధింపులు అరికట్టండి

**- ఐకాసా నాయకులు**



**ఆళ్లగడ్డ (భారత శక్తి)**ఆళ్లగడ్డ పట్టణంలో వ్యాపారులు హిజ్రాల ఆగడాలతో అల్లాడిపో తున్నారు.. ఆళ్లగడ్డ పట్టణంలోని టీబీ రోడ్డులోని ప్రధాన రహదారిలో ఉన్న దుకాణదారుల వద్ద సోమవారం నుండి గురువారం వరకు ప్రతిరోజు ఎవరో ఒకరు హిజ్రాలు రావడం డబ్బులు అడగడం ఇవ్వని వారిపై అసభ్య పదజాలంతో దూషించి వారికి అంగాంగ ప్రదర్శనలు చేయించడం లాంటివి చేస్తూ ఉండటంతో దుకాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. అంతేకాక ద్విచక్ర వాహనదారులు ఆటోల వద్ద పట్టణ శివారులలోని మలుపుల వద్ద మాటు వేసి వాహనాలను ఆపి వారి వద్ద నుంచి కూడా దౌర్జన్యంగా డబ్బులను డిమాండ్ చేస్తున్నారని ఐకాసా నాయకులు పెన్నెం సుధాకర్, బీరువాళ్ళ భాషాలు తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలో వ్యాపారాలు చేసుకోవాలంటే వీళ్లకు నజరానాలు ఇవ్వవలసి వస్తుందని అన్నారు. రౌడీలు, గుండాలను మించి హిజ్రాలు డబ్బులు వసూలు చేస్తున్నారని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష మాలల సంక్షేమం మరియు అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెన్నెం సుధాకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆళ్లగడ్డ పట్టణంలోని పోలీసు వారు హిజ్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారిని ఆళ్లగడ్డ పట్టణంలోనికి ప్రవేశించ కుండా నిషేధం విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష, సభ్యుడు హుస్సేన్ భాష, వలి భాష, రాష్ట్ర మాలల సంక్షేమం మరియు అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మరియు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి యూనివర్సిటీలో 3వ కాన్వొకేషన్ డే (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలు

**(భారత శక్తి)**మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బుధవారం 3వ కాన్వొకేషన్ డే (గ్రాడ్యుయేషన్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. విశిష్ట ప్రతిభ కనబరిచిన టాపర్లకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మల్లారెడ్డి, లక్ష్యాలను ముద్దాడుతూ భవిష్యత్తును జయించాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నేటి పోటీ ప్రపంచంలో నిరంతరం నేర్చుకునే తత్వం, పట్టుదల ఉన్నవారికే విజయం దక్కుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలతో యూనివర్సిటీ క్యాంపస్ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

# పోగొట్టుకున్న 10 ఫోన్లను బాధితులకు అందజేత

**- పిడుగురాళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. వెంకట్రావు**



**పిడుగురాళ్ల (భారత శక్తి)** పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 ఒ 2025, 2026 సంవత్సరంలో పోగొట్టుకున్న 10 సెల్ ఫోన్ లను బాధితులకు అందజేయడం జరిగింది అని పిడుగురాళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్రావు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ( సైబర్ సెల్/ సెంట్రల్ ఎక్విప్మెంట్, ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ) ఉపయోగించి పిడుగురాళ్ల పోలీసులు ఎప్పటికప్పుడు రికవరీ చేసి బాధితులకు 10 సెల్ ఫోన్ లను అందజేసామన్నారు. ఫోన్ పోయిన బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ లో ఐఎంఈఐ (తిఓఇతి) నంబర్, కొనుగోలు రసీదులతో సహా స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ తో జతచేసి అందజేయాలని సీఐ వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా సెల్ ఫోన్ బాధితులు పల్నాడు జిల్లా ఎస్పీ కి, పిడుగురాళ్ల సిఐ వెంకట్రావు కు కృతజ్ఞతలు తెలియపరిచీ ఆనందం వ్యక్తం చేశారు.

## అడవిలో గుర్తుతెలియని వృద్ధురాలి

# మృతదేహం లభ్యం

**- బద్వేల్ రూరల్ పోలీసుల విచారణ**



**బద్వేలు(భారత శక్తి)** బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్. రామాపురము అటవీ ప్రాంతంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు పైబడిన ఒక గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కుళ్ళిన స్థితిలో లభ్యమైనట్లు బద్వేల్ రూరల్ పోలీసులు తెలిపారు. రాచాయపేట మరియు ఎస్ రామాపురము ఇంచార్జ్ గ్రామ రెవిన్యూ అధికారి గూడూరు గురప్ప తెలిపిన వివరాల ప్రకారం రామాపురము ఎస్సీ కాలనీకి చెందిన నాగదాసరి కిట్టయ్య, చౌడూరు వెంకటేశు, పసుపులేటి సంతోష్ అనే వ్యక్తులు టి సంద్రపల్లి పల్లికి పడమర దిక్కున ఉన్న అడవిలో మేకలు మేపుకోవడానికి వెళ్లారు. అక్కడ 'చక్కని కోన - పంగాల శెల' వద్ద ఒక మహిళా శవము కుళ్లిపోయి, దుర్వాసన వస్తూ ఉండటాన్ని గమనించి వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని గ్రామ రెవిన్యూ సహాయకుడు ఆర్లగడ్డ నరసింహ రాజు ద్వారా తెలుసుకున్న విఆర్ఓ గురప్ప, బుధవారం ఉదయం గ్రామస్తులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి వివరాలు ఒ ఆనవాళ్లు:వయస్సు: సుమారు 60 సంవత్సరాల పైబడి ఉంటుంది. ధరించిన దుస్తులు: ఆరెంజ్ కలర్ చీర, బులుగు (బ్లూ) రంగు రవిక (దానిపై తెలుపు గుర్తులు ఉన్న డిజైన్) ఉన్నాయి. మరణానికి గల కారణాలు (ప్రాథమిక అంచనా): సదరు మహిళ మతిస్థిమితం లేని వ్యక్తిగా భావిస్తున్నారు. గతంలో (ఈనెల 4వ తేదీన) ఆమె రామాపురము గ్రామంలో సంచరిస్తూ, గ్రామస్తులు పెట్టిన ఆహారాన్ని కూడా సరిగా తినకుండా తిరిగేదని స్థానికులు గుర్తుపట్టారు. మతిస్థిమితం లేకపోవడం వల్ల ఆమె అటవీ ప్రాంతంలోకి వెళ్లి ఉండవచ్చని, ఎండ తీవ్రతకు తోడు నీరు, ఆహారం లభించక నీరసించి చనిపోయి ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఘటనపై గ్రామ రెవిన్యూ అధికారి గూడూరు గురప్ప వీఆర్‌ఏ లు ఆర్లగడ్డ నరసింహ రాజు, నాగదాసరి రాజశేఖర్ బాబులతో కలిసి బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతురాలి వివరాల కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈమెకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా బద్వేల్ రూరల్ పోలీసులను సంప్రదించాల్సిందిగా కోరారు

# ఈనెల 28 పల్స్ పోలియో కార్యక్రమం

**- రాష్ట్రవ్యాప్తంగా 49.20 లక్షల మంది చిన్నారులే లక్ష్యం**



**పిడుగురాళ్ల (భారత శక్తి)** ఈనెల 28న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదేళ్ల లోపు 49.20 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించటమే లక్ష్యంగా యంత్రాంగం సిద్ధమైంది. దేశాన్ని పోలియో రహితంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో, గతంలో పోలియో చుక్కలు వేయించుకున్నప్పటికీ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా మరోసారి వ్యాక్సిన్ వేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణం, రూరల్ మొత్తం కలిపి సుమారుగా 12,615 మంది చిన్నారులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. పిడుగురాళ్ల పిహెచ్ సి పరిధిలో 3,247, ఎల్ఐసి బజార్, అన్నా క్యాంటీన్ దగ్గర ఉన్న పీహెచ్సీ నందు 2,608, కరాలపాడు పిహెచ్ సి పరిధిలో 3,301, జానపాడు రోడ్డు పి హెచ్ సి పరిధిలో 1,933, ప్రజాశక్తి నగర్ పిహెచ్ సి లో 1,526 మంది చిన్నారులు ఉన్నారు. మండలం మొత్తం 12,615 మంది చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకునే టందుకు సిద్ధంగా ఉన్నారు. తొలి రోజు పోలియో కేంద్రాల్లో చుక్కలు వేయించుకోలేని వారికోసం ఆ తరువాత రెండు రోజులు ఇంటింటి సర్వే ద్వారా వ్యాక్సిన్ వేస్తారని డాక్టర్లు తెలిపారు.

# భూమయ్యగారిపల్లెలో గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైయస్ జగన్



**బద్వేలు(భారత శక్తి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ బుధవారం పులివెందుల పర్యటనలో భాగంగా వేముల మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయానికి చేరుకున్న వైయస్ జగన్‌కు అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలశ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ జగన్, స్వామివారికి నిర్వహిస్తున్న సుదర్శన హోమంలోనూ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గట్టు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దీవెనలు రాష్ట్ర ప్రజలందరికీ, భక్తులందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులను, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు.

### ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి కుటుంబానికి పరామర్శ

ఆలయ కార్యక్రమం అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఓబుళరెడ్డి శ్రీరామిరెడ్డి నివాసానికి వెళ్లిన వైయస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో శ్రీరామిరెడ్డి మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చిన వైయస్ జగన్, వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీరామిరెడ్డి పార్టీ కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన మరణం వైఎస్సార్‌సీపీకి తీరని లోటని పేర్కొన్నారు.పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వైయస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు.

## యువత మాదకద్రవ్యాలకు

# దూరంగా ఉండాలి

**- పోలీస్ కమిషనరేట్ అవగాహన సదస్సు**




**కరీంనగర్ (భారత శక్తి)**అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవ రోజు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో దుర్షెడ్ జిల్లా పరిషద్ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో మాదక ద్రవ్యాల దుర్వినియోగంకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసారు.ముఖ్యమైన అంశాలు:అన్ని ప్రాంతాల్లో అవగాహన..కరీంనగర్ లోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలోనూ ఈ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు సీపీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.యువతపై ప్రత్యేక దృష్టి: భవిష్యత్తు తరాలైన యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు పోలీసు శాఖ నిరంతరం అవసరమైన చర్యలు చేపడుతుందని సీపీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ స్థానిక కార్పొరేటర్ రవీందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెడ్ మాస్టర్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి లో అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టు

**సిద్దిపేట(భారత శక్తి)** కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు చేదించారు. ఫిర్యాదారుడు సార్ల సురేష్ తన ఇంట్లో ఎవరు లేనప్పుడు, ఇంట్లో ఉన్నటువంటి బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30-05-2026 రోజున కొమురెల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ క్రమంలో మంగళవారం 23-06-2026 న కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామ శివారులో గల గుర్జకుంట కమాన్ వద్ద ఎస్ఐ. టి. మహేష్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు.విచారణలో నిందితులు ఏ-1. డొంగరి రాజు ఏ-2: పొట్ట ప్రవీణ్ ఏ-3: బొద్దుల శ్రీనాథ్ మెదక్ జిల్లా కుల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చేపల దుకాణంలో మహిళ మెడలో నుండి బంగారు పుస్తెల తాడు మరియు ఒక మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొబైల్ షాపులో నుండి హెచ్‌పీ ల్యాప్‌టాప్ మరియు సీసీ కెమెరా మానిటర్‌ను దొంగిలించినట్లు, అలాగే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు మరియు నగదును అపహరించినట్లు అంగీకరించారు.దొంగిలించిన బంగారు ఆభరణాలలో కొంత భాగాన్ని హైదరాబాద్‌లో విక్రయించగా, కుల్చారం కేసుకు సంబంధించిన బంగారు పుస్తెల తాడును నిజామాబాద్‌లోని0 ఎఫ్ ఈ డి బ్యాంకులో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైంది.స్వాధీనం చేసిన వస్తువులు:హెచ్ పి ఒక నిమిషం కంపెనీ ల్యాప్‌టాప్.సీసీ టీవీ మానిటర్‌నేరాలకు ఉపయోగించిన, పల్సర్ ఎన్ఎస్ 200 మోటార్ సైకిల్ నెం.ూ16ఇచి5296, యాక్టివా స్కూటీ నెం. ుఉ08ఉ86373 తులాల బంగారు గొలుసు.7 గ్రాముల బంగారు ఆభరణాలు8 తులాల వెండి పట్టగొలుసులు1 తులం వెండి కుంకుమ్ భరణ,తులం వెండి ఉగ్గు గిన్నె3 మొబైల్ ఫోన్లుమొత్తం 7 లక్షల




విలువగల సొత్తు స్వాధీనం ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన బి. రమేష్, సిఐ. చెరియాల, కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ. టి. మహేష్ తో పాటు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్,ఎస్ఐ తిరుపతి రెడ్డి మరియు సిబ్బందినీ సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అభినందించారు.

## దారుణం.. పుట్టిన పసికందును విసిరేసిన యువతి



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి , జూన్ 24: హైదరాబాద్ నగరంలోని గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోరం చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వాష్‌రూమ్‌లో యువతి ప్రసవించిన అనంతరం, పుట్టిన పసికందును వెంటిలేటర్ కిటికీలోంచి కిందకు విసిరేయడంతో ఆ నవజాత శిశువు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర రక్తస్రావంతో అస్వస్థతకు గురైన సదరు యువతిని హాస్టల్ సిబ్బంది చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోంది.

ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేకెత్తించింది. అయితే సదరు యువతి గర్భం దాల్చిన విషయం ఇన్నాళ్లూ హాస్టల్ సిబ్బందికి గానీ, తోటి రూమ్‌మేట్స్‌కు గానీ తెలియకపోవడం గమనార్హం. కాగా, సదరు యువతి తన సొంత బావ కారణంగానే గర్భం దాల్చి ఉండవచ్చని ఆమె కుటుంబ సభ్యులు గట్టిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమానుష ఘటనపై కేసు నమోదు చేసుకున్న గోల్కొండ పోలీసులు.. అసలు యువతి గర్భం దాల్చడానికి గల కారణాలు మరియు పసికందును అంతమొందించడం వెనుక ఉన్న పూర్తి వివరాలను సేకరించే పనిలో పడ్డారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో ఇందిరమ్మ చీరల పంపిణీ..

**- ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి.**



బాలాపూర్: జూన్ 24 భారత శక్తి, మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధి బాలాపూర్ డివిజన్ లో బుధవారం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంతో పాటు,



లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మొదట బాలాపూర్ డివిజన్ లో మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి గారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి మహిళకు చీర అందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆమె గుర్తు చేశారు.అనంతరం బాలాపూర్ లో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అందజేసిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు తుళ్ళ నర్సింగ్ గౌడ్ గారి నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొని, రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు.ఈ రెండు కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బలింగని జంగయ్య, గిరికటి కృష్ణంరాజు గౌడ్, టేకుల శశిధర్ రెడ్డి, పగడాల ఉమేష్, అరవింద్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియపై పొలిటికల్ ఏజెంట్లకు శిక్షణ

**ఎల్.బి. నగర్ సర్కిల్-13 పరిధిలో జూన్ 25 నుంచి 'ఎస్ఐఆర్'**





ఎల్.బి. నగర్, జూన్ 24 (భారత శక్తి):ఎల్.బి. నగర్ సర్కిల్-13 పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణా కార్యక్రమం బుధవారం సరూర్‌నగర్‌లోని జ్యోతి క్లబ్‌లో జరిగింది. జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల నమోదు/సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఏజెంట్లకు అవగాహన కల్పించేందుకు సర్కిల్-13 ఏఈఆర్ఓ, డీసీ బి. శ్రీనివాస్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

**- ప్రత్యేక ఓటర్ల నమోదుపై అవగాహన**

ఈ సందర్భంగా డీసీ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడంలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఏజెంట్లు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఏఎల్ఎంటీ) సురేష్, విక్రమార్క పాల్గొని ఓటర్ల నమోదు ప్రక్రియపై క్షేత్రస్థాయి సాంకేతికతను, నిబంధనలను ఏజెంట్లకు వివరించారు.


**- 150 మంది ఏజెంట్ల హాజరు**

ఈ శిక్షణా కార్యక్రమంలో సర్కిల్-13 ఏఎంసీలు ఎం.ఏ. ఖదీర్, ఎం. చంద్రశేఖర్‌తో పాటు ఐఎన్‌సీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 150 మంది బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.

## "మాదకద్రవ్యాలకు నో... లక్ష్యాలకు యెస్" చెప్పండి.

**రేపటి భవిష్యత్తుకు మార్గదర్శకాలు మీరే.**
**విద్యార్థులతో కలిసి గంజాయి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసిన జిల్లా ఎస్పీ డా. శబరీష్,**






మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 24( భారత శక్తి ):నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, ప్రతి ఒక్కరూ తమ జీవిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. "సే నో టూ డ్రక్స్ --" సే ఎస్ టూ లైఫ్ " అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఆచరణలో పెట్టాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్, అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన "మన ఊరు -- మన బాధ్యత" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్, పాల్గొని విద్యార్థులకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో 9వ, 10వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, ఒక్కసారి వాటికి బానిసైతే చదువు, ఆరోగ్యం, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. విద్యార్థి దశలో లక్ష్యాలపై దృష్టి సారించి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా మంచి పేరు తీసుకురావాలని, చెడు స్నేహాలు, చెడు అలవాట్లు మరియు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం గంజాయి వ్యతిరేక సందేశాలతో రూపొందించిన »»Say No To Drugsµµ పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించి విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను సమాజానికి తెలియజేయడంలో యువత ముందుండాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన " వాల్ ఆఫ్ ప్రామిస్" వద్ద విద్యార్థులందరితో కలిసి ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ తోటి విద్యార్థులను కూడా చెడు అలవాట్ల బారిన పడకుండా చైతన్యవంతులను చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ విద్యార్థులు వాల్ ఆఫ్ ప్రామిస్‌పై సంతకాలు చేశారు. వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గంజాయి రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతు ప్రకటించారు.యువతలో చైతన్యం పెంపొందించడం ద్వారా మాత్రమే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ మరియు ఈగలు ఫోర్స్ చేపడుతున్న కార్యక్రమాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.గంజాయి సాగు, రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం అందించిన వారికి రూ.5,000 వరకు నగదు బహుమతి అందజేయబడుతుందని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పేర్కొంటూ, గంజాయికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా 87126 56999 నంబర్‌కు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి తిరుపతిరావు, సీఐ సత్యనారాయణ ఎస్సై క్రాంతి కుమారు పాఠశాల హెచ్ఎం, వార్డ్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మతిపోయిన ఖాకీలు...

## క్యాన్సర్ యువకుడిపై ముగ్గురి పోలీసుల లైంగిక దాడి

**- కీమోథెరపీతో వెంట్రుకలు ఊడిపోతే.. అమ్మాయిల ఉన్నావంటూ వేధింపులు**
**- క్యాన్సర్ మగ పేషెంట్‌పై ముగ్గురు పోలీసుల లైంగిక దాడి**
**- ఇద్దరు ఏఎస్సైలు, ఒక కానిస్టేబుల్ సస్పెండ్**



హర్యానా,జూన్ 24: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడిపై ముగ్గురు పోలీసులు దారుణానికి ఒడిగట్టారు. కీమోథెరపీ చికిత్సతో కాళ్లు, చేతులకు వెంట్రుకలు ఊడిపోవడంతో అమ్మాయిలు ఉన్నావంటూ వేధించడమే కాకుండా, అతనిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాలో జరిగిన ఈ ఘటలన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ముగ్గురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

**బాధితుడి కథనం ప్రకారం**

హర్యానాలోని కురుక్షేత్ర జిల్లా బన్‌గావ్ గ్రామానికి చెందిన ఓ యువకుడు (30) బ్యాంక్ ఉద్యోగి. కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అతను కీమోథెరపీ చికిత్స తీసుకుంటున్నాడు. జూన్ 17వ తేదీన రాత్రి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఇంద్రి రోడ్డులో పోలీసులు తనిఖీ కోసం వాహనాన్ని ఆపారు. మొహానికి గుడ్డ కట్టుకోవడంతో అతన్ని ఆపి ఇద్దరు ఏఎస్సైలు, హోంగార్డు నిలదీశారు. యువకుడిని చెంపదెబ్బలు కొట్టి, మొబైల్ ఫోన్ లాక్కొని బలవంతంగా లద్వా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తాను క్యాన్సర్ రోగిని అని.. చికిత్స తీసుకుంటున్నానని చెప్పినా పోలీసులు సదరు యువకుడిపై కనికరం చూపించలేదు. కీమోథెరపీ తర్వాత శరీరంపై వెంట్రుకలు ఊడిపోతే.. అతని అనారోగ్యాన్ని ఎగతాళి చేశారు. కాళ్లపై వెంట్రుకలు లేకపోతే అమ్మాయిల స్మూత్‌గా ఉన్నావంటూ లైంగిక దాడికి పాల్పడ్డారు.

**- నిర్ధారించిన వైద్య పరీక్షలు... ముగ్గురు పోలీసుల సస్పెండ్**

పోలీసుల దుశ్చర్య తర్వాత ఇంటికెళ్లిన యువకుడికి మరుసటి రోజు పిర్రల మధ్య రక్తస్రావం జరగడంతో కుటుంబసభ్యులకు విషయం చెప్పాడు. ఘటన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తొలుత లద్వా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఈ ఘటనపై బాధిత యువకుడు, కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వైద్య పరీక్షలు నిర్వహించి యువకుడి కాలు విరిగిందని, లైంగిక దాడి జరిగిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో అఘాయిత్యానికి ఒడిగట్టిన ఏఎస్సైలు సంజీవ్ కుమార్, రాజేందర్ కుమార్, హోంగార్డు సుమిత్‌లపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ చంద్రమోహన్ తెలిపారు. ఆ ముగ్గుర్నీ సస్పెండ్ చేశామని వెల్లడించారు. ఈ ఘటనపై విచారణకు ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## వీడిన కృష్ణలంక కేసు మిస్టరీ.. జై భీమ్' సీన్ రిపీట్!!-

### సాయికృష్ణది లాకప్ డెత్తే.. కోర్టుకు సమర్పించిన నివేదికలో నిర్ధారించిన 'సిట్'!

**- తీవ్ర థర్డ్ డిగ్రీ హింసకు తాళలేక యువకుడు సాయికృష్ణ లాకప్ డెత్**
**- మృతదేహాన్ని స్వర్గపురి శ్మశానవాటికలో రహస్యంగా దహనం చేసిన పోలీసులు**
**- కేసును తప్పుదోవ పట్టించడానికి పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్ మొత్తాన్ని ఉద్దేశపూర్వకంగా డిలీట్ చేసిన వైనం**
**- సీఐ నాగరాజును దర్యాప్తుకు సహకరించడం లేదన్న సిట్**
**-14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్.. నెల్లూరు జైలుకు తరలింపు**



విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, జూన్ 24: విజయవాడ నగరంలో గత కొన్ని రోజులుగా ఉత్కంఠ రేపుతున్న గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు చివరకు దారుణమైన లాకప్ డెత్‌గా నిర్ధారణ అయింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ఎస్వీ నాగరాజును సిట్ అధికారులు మంగళవారం అరెస్ట్ చేయగా.. బుధవారం ఉదయం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో, పోలీసులు అతనిని నెల్లూరు జైలుకు తరలించారు.

సిట్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో 'జై భీమ్' సినిమా తరహాలోనే గుండె తరుక్కుపోయే నిజాలను వెల్లడించింది. సాయికృష్ణ అనే యువకుడిని పోలీసులు నిర్బంధించి, స్టేషన్‌లో అత్యంత అమానవీయంగా థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలు పెట్టారు. పోలీసుల దెబ్బలకు తాళలేక సాయికృష్ణ స్టేషన్ లోపలే కన్నుమూశాడు. ఈ ఘోరాన్ని కప్పిపుచ్చేందుకు అప్పటి సీఐ నాగరాజు హాలీవుడ్ విలన్ తరహాలో ప్లాన్ వేశాడు. స్టేషన్‌లో తాము చేసిన నిర్వాకం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు పీఎస్‌లోని సిసిటివి ఫుటేజ్ మొత్తాన్ని పూర్తిగా డిలీట్ చేయించాడు. అనంతరం మృతదేహాన్ని ఎవరికీ అనుమానం రాకుండా సిటీలోని 'స్వర్గపురి' శ్మశానవాటికకు తరలించి, రికార్డులను సైతం తారుమారు చేసి అనాథ శవంగా రహస్యంగా దహనం చేయించేశారు. తన కొడుకు కనిపించడం లేదంటూ తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో పాటు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ నరరూప రాక్షసుల గుట్టు రట్టయింది. ప్రభుత్వం రంగంలోకి దించిన 'సిట్' బృందం కేవలం 3 గంటల సుదీర్ఘ విచారణలోనే సాంకేతిక ఆధారాల సహాయంతో సాక్ష్యాలను సేకరించి సీఐని బుక్ చేసింది. ఈ ఘటన ఖాకీ యూనిఫాంలో దాగున్న క్రూరత్వాన్ని బయటపెట్టడమే కాకుండా, బాధితుడి కుటుంబానికి జరిగిన తీరని అన్యాయం స్థానికుల కళ్లల్లో నీళ్లు తెప్పిస్తోంది.

## సమాజ సేవకు అరుదైన గౌరవం

**- పెద్ది శంకర్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం**
**చిత్ర, దృశ్య మాధ్యమ డిజిటల్ పురస్కారాల వేడుకలో 'రెడీ టూ సర్వ్' నిర్వాహకుడికి ఘన సత్కారం**




హైదరాబాద్ జూన్22 (భారత శక్తి ):సమాజంలో నిరాదరణకు గురైన అనాథ వృద్ధులను చేరదీసి, వారికి అండగా నిలుస్తూ నిరంతర సేవలందిస్తున్న 'రెడీ టూ సర్వ్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పెద్ది శంకర్‌కు అరుదైన గౌరవం దక్కింది. వీబీ ఎంటర్‌టైన్మెంట్స్ అధినేత బొప్పన విష్ణు ఆధ్వర్యంలో జరిగిన "చిత్ర, దృశ్య మాధ్యమ సమాచార సూచిక (ఫిల్మ్, టీవీ డైరెక్టరీ) - 2026 డిజిటల్ మీడియా అవార్డ్స్" వేడుకలో శంకర్‌ను ఘనంగా సత్కరించారు.

**సేవా గుణానికి ఆర్థిక మద్దతు**

గ్లామర్ ప్రపంచానికి సంబంధించిన ఈ వేదికపై పెద్ది శంకర్ అందిస్తున్న నిరుపమాన సామాజిక సేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖులు అంబికా కృష్ణ, విజయ్ భాస్కర్, శివ కంటమనేని, రాజశేఖర్ అనిగి, మాదాల రవి, బొప్పన విష్ణు తదితరులు కలిసి పెద్ది శంకర్‌ను వేదికపై శాలువాతో సత్కరించి, అవార్డును అందజేశారు. కేవలం పురస్కారానికే పరిమితం కాకుండా, ఆయన నడుపుతున్న స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలకు మద్దతుగా నిర్వాహకులు ఈ వేడుకలో ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని కూడా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు.

**- ప్రతిభకు పట్టం.. భవిష్యత్తుకు స్ఫూర్తి**

"ప్రతిభను గౌరవించడం.. భవిష్యత్తుకు స్ఫూర్తినివ్వడం" అనే నినాదంతో జరిగిన ఈ వేడుకలో డిజిటల్ మీడియా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు అవార్డులు అందుకున్నారు. రంగుల ప్రపంచానికి సంబంధించిన ఈ ప్రతిష్టాత్మక వేదికపై, నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న పెద్ది శంకర్ లాంటి నిఖార్సైన సేవామూర్తిని గౌరవించడం పట్ల సదస్సులో పాల్గొన్న ప్రముఖులు, సందర్శకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సత్కారం తోటి సమాజానికి మరింత స్ఫూర్తినిస్తుందని కొనియాడారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy